నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నల్లగొండ
1
శనివారం | మార్చి 23, 2024 | www.navatelangana.com

బొంతల చంద్రారెడ్డిని కలిసిన ఎండి .జహంగీర్



నవతెలంగాణ-చిట్యాలటౌన్

సీపీఐ(ఎం) భువనగిరి పార్లమెంటు అభ్యర్థి ఎండి.జహంగీర్ శుక్రవారం మండలంలోని వెలిమినేడు లోని సీపీఐ(ఎం)కార్యాలయం కందాల రంగారెడ్డి స్మారక భవనంలోరైతు సంఘం రాష్ట్ర నాయకులు బొంతల చంద్రారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల రూరల్ కార్యదర్శి ఆరూరి శ్రీనివాసులు, పార్టీ నాయకులు నెల్లికంటి నరసింహ ,సుర్కంటి బుచ్చిరెడ్డి, అరూరి శంబయ్య, సుర్కంటి పాపిరెడ్డి, దేశ బోయిన లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో పలువురికి గాయాలు

నవతెలంగాణ-నకిరేకల్



నకిరేకల్ పట్టణంలో రెండు రోజులుగా గ్యాస్ కంపెనీ, ఏవీఎం పాఠశాల సమీపంలో పలువురిపై కుక్కలు దాడి చేశాయి. సుమారు 20 మందిపై కుక్కలు దాడి చేసినట్లు తెలుస్తుంది. శుక్రవారం మధ్యాహ్నం ఏవిఎం పాఠశాలకు చెందిన చనగాని సాయి ఈశ్వర్ పై ఓ కుక్క దాడి చేయడం వల్ల సంఘటన వెలుగులోకి వచ్చింది. గురువారం ఆరుగురిపై, శుక్రవారం సుమారు 15 మందిపై కుక్కలు దాడి దాడి చేయగా చికిత్స కోసం ఆసుపత్రికి వచ్చినట్లు ప్రభుత్వాసుపత్రి సిబ్బంది తెలిపింది.

డ్యామ్‌ను సందర్శించిన కేఆర్ఎంబీ బృందం సభ్యులు



నవతెలంగాణ-నాగార్జునసాగర్

కేఆర్ఎంబీ బృందం సభ్యులు డాక్టర్ ఆర్ఎస్ సాంఖున ఆధ్వర్యంలో శుక్రవారం నాగార్జునసాగర్ డ్యాంను సందర్శించారు. నాగార్జునసాగర్ హిల్ కాలనీలోని విజయవిహార్ చేరుకున్న వీరిని ఎస్ఎస్పీ ఎస్ఈ నాగేశ్వరరావు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం నాగార్జునసాగర్ డ్యామ్ పరిశీలనలో భాగంగా క్రష్ట్ గేట్లు, గ్యాలరీ, వాక్ వే బ్రిడ్జి, స్పిల్ వేలను పరిశీలించారు. నాగార్జునసాగర్ డ్యామ్ కేఆర్ఎంబీ పరిధిలో ఉన్న నేపథ్యంలో డ్యామ్ భద్రత, నీటి నిలువ, నీటి వినియోగం తదితర అంశాలపై క్షుణ్ణంగా బృందం సభ్యులు పరిశీలించారు. నేడు జల విద్యుత్ కేంద్రాలను సందర్శించిన అనంతరం ఎస్ఎస్పి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు ఎస్ఎస్పీ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఈ మల్లికార్జున, ఏఈ కృష్ణయ్య, ఇరిగేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం అమ్ముకునేందుకు తీవ్ర ఇబ్బందులు

- రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బంటు వెంకటేశ్వర్లు

నవతెలంగాణ-మిర్యాలగూడ

అష్ట కష్టాలు పడి పండించిన పంటను అమ్ముకునేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బంటు వెంకటేశ్వర్లు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి ఎంతో శ్రమ వచ్చి పండించిన పంట సరిగా దిగుబడి రాకపోవడంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారన్నారు. పైగా పండిన పంటను అమ్ముకునేందుకు ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు ధాన్యాన్ని తీసుకెళ్లి మిల్లుల చుట్టూ తిరుగుతున్నారని మిల్లర్లు సకాలంలో స్పందించకపోవడం ధాన్యం ధర తగ్గించి ఇవ్వడంతో నష్టపోతున్నారని చెప్పారు. వరి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ధాన్యానికి మంచి ధర వచ్చేలా చూడాలన్నారు. ఆయన వెంట రైతులు సైదులు, బాలు, వెంకన్న, మధుబాబు, గోనియా నాయక్, రమేష్, కొండలు తదితరులు ఉన్నారు.

ప్రతిపక్ష నాయకుల అరెస్టుతో ...

బీజేపీ లబ్ధి పొందేందుకు ప్రయత్నం

- కేంద్రంలో బీజేపీ ఓటమే సీపీఐ(ఎం) లక్ష్యం
- జిల్లా కమిటీ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి



నవతెలంగాణ-నల్లగొండటౌన్

కేంద్రం ప్రభుత్వం ప్రతిపక్ష పార్టీల ముఖ్యమంత్రులను, నాయకులను అరెస్టు చేసి రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు బీజేపీ ప్రయత్నిస్తుందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి విమర్శించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని దొడ్డి కొమరయ్య భవనంలో జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్పొరేట్ సంస్థలపై ఐటీ, ఈడీ, సీబీఐ దాడులు చేయడంతో ఎలక్ట్రోల్ బాండ్స్ కొన్ని బీజేపీకు వేల కోట్ల రూపాయలు అందజేశారని, వాటి వివరాలను దాయడంతో సుప్రీంకోర్టుకు సీపీఐ(ఎం) పోయిందని, ఆ వివరాలను బహిరంగపరచాలని పార్టీ డిమాండ్ చేసిందని గుర్తు చేశారు. తీరా ఎన్నికల ముందే సీఏఏ చట్టాన్ని ముందుకు తెచ్చి బీజేపీ లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తుందన్నారు. బీజేపీ తిరిగే అధికారంలోకి వస్తే భారత రాజ్యాంగం, నిఘా సంస్థలు మరింత నిర్వీర్యమవుతాయన్నారు.తెలంగాణలో రజాకార్ సినిమా పేరుతో హిందూ, ముస్లింల మధ్య గొడవ సృష్టించడానికి బీజేపీ ప్రయత్నిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణలో భువనగిరి స్థానం నుండి సీపీఐ(ఎం) పోటీ చేస్తుందని చెప్పారు. భువనగిరి సీపీఐ(ఎం) అభ్యర్థిగా మహమ్మద్ జహంగీర్‌ను ప్రకటించినట్లు తెలిపారు. సీపీఐ(ఎం),సీపీఐ కు భిన్న అభిప్రాయాలు లేవని పరస్పర సహకారంతోనే పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ ఓటమి లక్ష్యంగా పనిచేస్తామని తెలిపారు. కాంగ్రెస్ తో సర్దుబాటు ఉంటే మంచిదని సీపీఐ(ఎం) భావిస్తుందని తెలిపారు. కాంగ్రెస్, సీపీఐ(ఎం),సీపీఐ తో సర్దుబాటు చేసుకోవడం ద్వారా బీజేపీని నిలువరించడానికి ఎక్కువ అవకాశాలు ఉంటాయన్నారు. ప్రభుత్వ గృహాలలో పేదలు వేసుకున్న గుడిసెలకు రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ గృహాలు ఇచ్చి ఐదు లక్షలతో పాటు కేంద్ర ప్రభుత్వం ద్వారా ప్రధాని ఆవాస్ యోజన పథకం కింద మరో 10 లక్షలు రూపాయలు ఇవ్వాలనానరు. ఇల్లు, ఇంటి స్థలం వస్తుందన్న ఆశతో పేదలు కాంగ్రెస్ ప్రభుత్వంకు ఓట్లు వేసి గెలిపించుకున్నారని వారి ఆశలు వమ్ము చేయవద్దని అన్నారు. మేడిగడ్డ ప్రాజెక్టు నిర్మాణ భవిష్యత్తుపై మనుగడపై పునర్ నిర్మాణం పై మరమ్మతుల కోసం రాష్ట్రస్థాయిలో నిపుణుల కమిటీ వేయాలని కోరారు. ప్రాజెక్టు డిజైనింగ్ లోపాలు నిర్మాణంలో అవినీతి బిల్లుల చెల్లింపులు అక్రమాలు తదితర అంశాలను వెలికి తీసేందుకు న్యాయవిచారణ కమిటీ వేయాలని డిమాండ్ చేశారు. ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ రబీలో వేసిన వరి పంట చాలావరకు కోతలు మొదలైనప్పటికీ ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడం వల్ల మధ్య దళారిలకు అమ్ముకుంటున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రకటించిన బోనస్ కూడా ఈ సీజన్ నుండే ఇవ్వాలని కోరారు. ఇంకావేసవి ప్రారంభం కాకముందే అక్కడక్కడ మంచినీటి ఎద్దడి ఏర్పడుతుందని," నివారణకు సాగర్ ఎడమ కాలువ, ఏఎంఆర్పి ద్వారా చెరువులను నింపాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు తుమ్మల వీరారెడ్డి, నారి ఐలయ్య, డబ్బికార్ మల్లేష్, బండ శ్రీశైలం, కందాల ప్రమీల, సి హెచ్.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

కాలానికనుగుణంగా సాగుపై దృష్టి అవసరం

- పరిశోధన సంచాలకులు డాక్టర్ పి. రఘురాం రెడ్డి



నవతెలంగాణ-నల్గొండ కలెక్టరేట్

వాతావరణ పరిస్థితులకు అనుకూలంగా పంటల ప్రణాళిక, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యలపైన దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని పరిశోధన సంచాలకులు డాక్టర్ పి. రఘురామిరెడ్డి అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, నల్గొండ జిల్లా వ్యవసాయ శాఖ వారి సంయుక్త ఆధ్యర్యంలో నల్లగొండ జిల్లా కలెక్టరేట్లో నిర్వహిస్తున్న దక్షిణ తెలంగాణా మండల పరిశోధన విస్తరణ సలహా సంఘ సమావేశం శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం వాతావరణ విభాగం అధికారిని డాక్టర్ పి. లీలారాణి మాట్లాడుతూ ఆపత్కాల పరిస్థితులలో వివిధ పంటలలో తీసుకోవలసిన జాగ్రత్త చర్యలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రపంచ నీటి దినోత్సవాన్ని పురస్కరించుకుని వ్యవసాయ విశ్వా విద్యాలయం విస్తరణ సంచాలకులు డా.ఎ. సుధారాణి వాటర్ ఫర్ పీస్ వీడియోని ఆవిష్కరించారు. అనంతరం డా.కె. అవిల్ కుమార్, డైరెక్టర్ (నేటి సాంకేతిక పరిజ్ఞానం) వ్యవసాయంలో ముఖ్యతను, నేటి సంరక్షణ అవసరాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో దక్షిణ తెలంగాణ మండల సహ పరిశోధన సంచాలకులు డా. ఎం. మల్లారెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రవణ్ కుమార్, ప్రధాన శాస్త్రవేత్తలు ప్రాగం కో-ఆర్డినేటర్లు కో ఆర్డికేటర్లు, జిల్లా వ్యవసాయ, వ్యవసాయేతర అధికారులు, శాస్త్రవేత్తలు, అమబంధ రంగాల విత్తన ధ్రువీకరణ అధికారి, దక్షిణ తెలంగణా మండల రైతులు, ఎన్జీవో ప్రనిధులు పాల్గొన్నారు.

ఎంజీయూను ఆదర్శప్రాయంగా మలచిన పాలకమండలి

- ఉపకులపతి ఆచార్య గోపాల్ రెడ్డి



నవతెలంగాణ - నార్కట్ పల్లి

ఉన్నత విద్యా సంస్థల్లో విధాన నిర్ణయాల్లో కీలక భాగస్వామి అయిన పాలకమండలి దర్శినికత, సమిష్టితత్వం, తోడ్పాటు సంస్థల ఉనికి ఉన్నతికి అత్యంత ఆవశ్యకమని ఉపకులపతి ఆచార్య గోపాల్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఎంజీయూలో జరిగిన పాలకమండలి వీడ్కోల సమావేశంలో మాజీ సభ్యులకు చిరు సత్కారంచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విశ్వవిద్యాలయ పురోగతిలో సభ్యుల సహకారం మరువలేనిదన్నారు. సభ్యుల యొక్క విశిష్ట వ్యక్తిత్వాలు, నైపుణ్యాలు ప్రాధాన్యాలు కలగలుపు కొని సంస్థ ఉన్నతికి ప్రతి ఒక్కరూ అందించిన తోడ్పాటును వివరించారు. డా ఘనశ్యాం మాట్లాడుతూ ప్రతి ఒక్క అధ్యాపకుడు స్వీయ క్రమశిక్షణ ఆత్మ ప్రబోధానుసారం బాధ్యతాయుతంగా మెలిగినప్పుడే బలమైన వ్యవస్థలు రూపొందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య అలువాల రవి మాజీ పాలకమండలి సభ్యులు ఆచార్య కొప్పుల అంజిరెడ్డి, ఆచార్య ఆకుల రవి, డా శ్రీదేవి, బోయపల్లి కృష్ణారెడ్డి, డా ఘన శ్యామ్, డా కోయి కోటేశ్వరరావు, డా సూర్యనారాయణ రెడ్డి, సవీందర్ కుమార్, సోమ రమేష్, కళాశాలల ప్రిన్సిపాల్ లు కె అరుణప్రియ, సుధారాణి, డా మారం వెంకట రమణారెడ్డి, డా ప్రేమ్ సాగర్, డా మద్దిలేటి, డా ఉపేందర్ రెడ్డి, డా దోమల రమేష్, ఆచార్య అన్నపూర్ణ, ప్రశాంతి, రూప పాల్గొన్నారు.

బీసీ ఓవర్సీస్ స్కాలర్ షిప్ నిధులు విడుదల చేయాలి

నవతెలంగాణ-మిర్యాలగూడ



బీసీ ఓవర్సీస్ సాలర్‌షిప్ మంజూరై విదేశాల్లో ఉన్నత విద్య చదువుతున్న విద్యార్థులకు వెంటనే నిధులు విడుదల చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు వుక్రవారంసచివాలయంలో బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బుర్ర వెంకటేశం ను కలిసి వినతిపత్రం అందజేశారు..ఈ సందర్భంగా లింగంగౌడ్ మాట్లాడుతూ పెండింగులో ఉన్న నిధుల విడుదల జాప్యం వల్ల స్వదేశంలో ఉన్న తల్లిదండ్రులు,విదేశాల్లో ఉన్న విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. బీసీల జనాభా తగ్గట్టు విదేశీవిద్య సాలర్‌షిప్ సంఖ్యను 300 నుంచి కనీసం 2,000 మందికి పెంచాలని కోరారు.ఈ కార్యక్రమంలో తాడికొండ విక్రమ్, ఇంద్రం పాల్గొన్నారు.

మీనా కళాశాలలో జాబ్ మేళా

నవతెలంగాణ-మిర్యాలగూడ



స్థానిక మీనా మహిళా ఇంజనీరింగ్ కళాశాల నందు శుక్రవారం హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీలైన హైకీ, 24/7 ఏఐ ఆధ్వర్యంలో ప్రాంగణ నియామకాలు నిర్వహించారు. ఈ నియామకాలకు మిర్యాలగూడ పరిసర ప్రాంతాల నుండి దాదాపు 300 మంది రిజిస్ట్రేషన్ చేసుకుని నియామకాలకు హాజరయ్యారు. హైకీ డైరెక్టర్ గౌతమ్ రెడ్డి, జి.సుధీర్ టాస్క్ క్లస్టర్ మేనేజర్ లు పాల్గొని విద్యార్థినులను వివిధ అంశాల పట్ల ఇంటర్వ్యూ నిర్వహించి ప్రాంగణ ఎంపికలు నిర్వహించడంతో పాటు నిపుణత సాధించిన వారిని ఎంపిక చేశారు. హైకీ కంపెనీకి 21 మంది 24/7.ఏఐ సంస్థకు 80 మందిని ఎంపికచేశారు. ఎంపికైన విద్యార్థులకు కళాశాల చైర్మెన్ ఎండి మహమ్మద్ అలీ నియామక పత్రాలు అందజేశారు. అనంతరం కళాశాల చైర్మెన్ మాట్లాడుతూ నియామకాలు పొందిన అందరిని అభినందిస్తూ మరిన్ని మల్టీ నేషనల్ కంపెనీలను ముున్ముందు తీసుకొని రావటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ షహలబూతున్ ప్రిన్సిపాల్ డాక్టర్ కే .సునీత వైస్ ప్రిన్సిపాల్ వి .వాణి, డ్రైవ్ కోఆర్డినేటర్ ఫయాజ్, రమేష్, వివిధ విభాగాధిపతులు , అధ్యాపకులు పాల్గొన్నారు.

మహిళను గొంతు కోసి చంపిన నిందితుని అరెస్టు

- వివరాలు వెల్లడించిన డీఎస్పీ గిరిబాబు



నవతెలంగాణ-దేవరకొండ

ఈనెల 14వ తేదీన దేవరకొండ పట్టణంలోని ఆర్టీసీ బస్ డిపో పక్కన చెరుపల్లి అంతయ్య పాత భవనంపై మహిళను అతికిరాతంగా గొంతు కోసి చంపిన నిందితుని అరెస్టు చేసినట్టు డీఎస్పీ గిరిబాబు తెలిపారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్లో సీఐ నరసింహులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఈనెల 14వ తేదీన శ్రీలతను ఎవరు గుర్తుతెలియని వ్యక్తులు కత్తితో గొంతు కోసి చంపినట్లు ఆమె సోదరుడు విభూతి శ్రీనివాసు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశాం. డిండి మండలం గోనకొల్లు గ్రామానికి చెందిన శ్రీలత(37) దేవరకొండ పట్టణంలో కూలి పనులు చేస్తూ జీవనం గడుపుతుంది. ఆంధ్రప్రదేశ్ లో ప్రకాశం జిల్లా పుల్లల చెరువు మండలం సిద్ధన పాలెం గ్రామానికి చెందిన బొమ్మన బోయిన సాంబయ్య దేవరకొండ ప్రాంతం నుండి పత్తి, మిరప,పొగాకు పంటలు సాగు చేసేందుకు వ్యవసాయ కూలీలను తీసుకు వెళ్తూ ఉంటాడు . ఈ క్రమంలో ఆర్టీసీ బస్టాండ్ వద్ద తిరుగుతున్న నరసింహ అనే వ్యక్తితో పరిచయమయ్యాడు. నరసింహ శ్రీలతను సాంబయ్యకు పరిచయం చేసి, వ్యవసాయ పనులకు కావలసిన కూలీలను సమకూరుస్తారని నరసింహ సాంబయ్య తో చెప్పినట్లు తెలిపారు. ఈ ముగ్గురి మధ్య పరిచయం ఏర్పడి దేవరకొండలో రెండు ,మూడు సార్లు అందరూ కలిసి మద్యం కూడా సేవించారు. కూలీలను మాట్లాడే క్రమంలో శ్రీలత నిందితుని వద్ద కొంత డబ్బు తీసుకుంది. ఈ డబ్బులు తిరిగి ఇవ్వాలని ఈనెల 13వ తేదీన దేవరకొండకు వచ్చిన సాంబయ్య డబ్బులు అడగగా శ్రీలతకు నిందితునికి మధ్య గొడవ జరిగింది. డబ్బులు ఇవ్వను ఏం చేసుకుంటావో చేసుకో అని శ్రీలత బెదిరించగా నిందితుడు ఆమెను ఎలాగైనా చంపాలనే ఉద్దేశంతో ఆమెకు మద్యం తాపించి అతని ప్లాన్ ప్రకారం దేవరకొండ లోనే కత్తి కొని శ్రీలత గొంతు కోసి ఆమె చనిపోయినట్లు నిర్ధారించుకున్న తర్వాతనే అక్కడి నుండి పారిపోయాడు. ఈ కేసును చాలెంజ్ గా తీసుకున్న ఎస్పీ చందనా దీప్తి పర్యవేక్షణలో దేవరకొండ డి.ఎస్.పి జి .గిరిబాబు ఆధ్వర్యంలో సీఐ ఎం. నరసింహులు క్లూస్ టీం సహాయంతో కేసును చేదించారు. కేసును చేదించినందుకు సీఐ ఎం. నరసింహులు, ఎస్ఐలు డి .సైదులు, ఏ .రమేష్, నందులాలు, హెడ్ కానిస్టేబుల్ ఈ. బాలు నాయక్, తిరుపతి, రాజారాం, శంకర్ శ్రీధర్ రెడ్డి హోమ్ గార్డ్స్ సింహాద్రి, యాదయ్య ,చంద్రమౌళి, ఏడుకొండలు, సోమ్లా లను ఎస్పీ అభినందించినట్లు తెలిపారు. వారికి రివార్డు కూడా ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో డి .సైదులు, ఏ. రమేష్ ,నందులాల్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రజాస్వామ్యానికి తూట్లు పొడుస్తున్న మోడీ ప్రభుత్వం'

నవతెలంగాణ-నల్లగొండటౌన్



దేశంలోప్రజాస్వామ్యానికి.ప్రజాస్వామ్య వ్యవస్థ కు మోడీ ప్రభుత్వం తూట్లు పొడుస్తున్నదని యువజన కాంగ్రెస్ నల్గొండ జిల్లా అధ్యక్షులు గౌని రాజా రమేష్ యాదవ్ అన్నారు. .యువజన కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు బివి శ్రీనివాస్, రాష్ట్ర అధ్యక్షుడు శివసేన రెడ్డి పిలుపు మేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలో మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈకార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కసిరెడ్డి జయంత్ రెడ్డి,ప్రదాన కార్యదర్శి పుట్ట రాకేష్, నల్గొండ నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్ కె జహంగీర్, మిర్యాలగూడ అధ్యక్షుడు అజార్, పట్టణ అధ్యక్షుడు గాలి నాగరాజు,నల్గొండ మండల అధ్యక్షుడు నవీన్,కనగల్ మండల అధ్యక్షులు రాజి రెడ్డి,సంగం కీర్తి, సిద్ధార్థ, అజారుద్దీన్, ముజ్జు, బిలాల్, నరేష్, ఇర్ఫాన్, అరుణ్ ,వెంకన్న , తదితరులు పాల్గొన్నారు.

ఏబీసీడబ్ల్యూఓలను తక్షణమే సస్పెండ్ చేయాలి

- విజిలెన్స్ అధికారులతో విచారణ చేపట్టాలి
- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కంభంపాటి శంకర్



నవతెలంగాణ-నల్గొండ కలెక్టరేట్

బీసీ వెల్ఫేర్ హాస్టల్‌లో వర్కర్ల నియామకంలో నిబంధనలకు విరుద్ధంగా అక్రమాలకు పాల్పడి, వర్కర్ల నుండి లక్షల రూపాయలను వసూలు చేసిన ఏబీసీడబ్ల్యూఓలను తక్షణమే సస్పెండ్ చేయాలని, విషయంపై విజిలెన్స్ అధికారులచే విచారణ చేయించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శి ఆకారపు నరేష్, కంభంపాటి శంకర్ లు డిమాండ్ చేశారు. శుక్రవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ లోని బీసీ వెల్ఫేర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్రమాలకు పాల్పడిన వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. నిరుపేద కుటుంబాలకు అండగా నిలవాల్సిన బీసీ వెల్ఫేర్ అధికారులు వర్కర్ల నియామకంలో అక్రమాలకు పాల్పడటమే కాకుండా, పార్ట్ టైం వర్కర్ల నుండి కూడా ముక్కు పిండి డబ్బులు వసూలు చేశారని ఆరోపించారు. బాధితులంతా ఒక్కొక్కరిగా తమ గోడును వెల్లడిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్కొక్క వర్కర్ నుండి లక్షకు పైగా వసూలు చేశారని, ఆ డబ్బులను ఏబిసి డబ్ల్యూఓల తో పాటు ఏజెన్సీ నిర్వాహకుడు తీసుకున్నాడని, అయినా కూడా అధికారులు నేటికీ వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. కలెక్టర్ వెంటనే స్పందించి విచారణ చేయించి వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, అందుకు కారకులైన ఏబీసీడబ్ల్యూఓ ను తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ ధర్నా కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర గర్ల్స్ కో కన్వీనర్ కుంచం కావ్య, కోరే రమేష్, స్పందన, అంజలి తదితరులు పాల్గొన్నారు.

నేడు వికలాంగులకు పరికరాలు అందజేత

నవతెలంగాణ-చింతపల్లి

నియోజకవర్గంలోని అన్ని మండలాల వికలాంగులకు నేడు దేవరకొండ లోని ఎంపీడీవో కార్యాలయంలో ఆర్‌డీటీ సంస్థ ఆధ్వర్యంలో పరికరాలు అందజేయనున్నట్లు ఏటీఎల్ రామ్మోహన్, జీవో ఆహమ్మద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9గంటల నుండి ఆర్థోవర్క్‌షాపు ఉంటుందని పేర్కొన్నారు. ట్రై సైకిల్, వీల్ చైర్‌లు, సంఖచేతి కర్రలు, ప్లాస్టిక్ కాలు, స్టిక్, వికలాంగులకు సంబంధించిన పరికరాలు ఇవ్వడం కోసం వారి మెజర్‌మెంట్ తీసుకొని కృత్రిమ పరికరాలు ఇస్తారని తెలిపారు. ఈఅవకాశాన్ని వికలాంగులు వినియోగించుకోవాలని, సమాచారం కోసం 9502802743 నెంబర్‌కు ఫోనుచేయాలని పేర్కొన్నారు.

న్యాయవాదుల సంఘం అధ్యక్షునిగా పూజర్ల శంభయ్య

నవతెలంగాణ-నకిరేకల్



నకిరేకల్ న్యాయవాదుల సంఘం నూతన అధ్యక్షునిగా పూజర్ల శంభయ్య ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి పోతుల మల్లయ్య తెలిపారు. ఉపాధ్యక్షులుగా నోముల మనోహర్, ప్రధాన కార్యదర్శిగా మంగ సైదులు, సహాయ కార్యదర్శిగా నూకల మల్లేష్, కోశాధికారిగా బొబ్బల నరసింహారెడ్డి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా పూజర్ల శంభయ్య మాట్లాడుతూ న్యాయవాదుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. నూతనంగా ఎన్నికైన కమిటీని న్యాయవాదులు ఘనంగా సన్మానించారు.

మాజీ సర్పంచ్ ముప్పిడి పిచ్చమ్మ కనబడటం లేదు

నవ తెలంగాణ - నార్కట్ పల్లి



మండల పరిధిలోని ఔరవాణి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ముప్పిడి పిచ్చమ్మ (63) శుక్రవారం రోజు ఉదయం 6 గంటల సమయంలో కనపడకుండా ఎటు వెళ్లిపోయినదని ఆమె సోదరుడు పందుల యాదయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నర్ర అంతిరెడ్డి పేర్కొన్నారు.

పీఏసీఎస్ చైర్మెన్‌గా మట్టయ్య



నవతెలంగాణ-చిలుకూరు

మండలంలోని పాలే అన్నారం పీఏసీఎస్ చైర్మెన్‌గా దేశబోయిన మట్టయను శుక్రవారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన మట్టయ్య మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఎన్నుకున్నందుకు అందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు పిఎసిఎస్ సంఘాన్ని బలోపేతం చేసే విధంగా చర్యలు తీసుకుంటాన్నారు. రైతులకు నిరంతరం ఎల్లవేళలా ఎరువులను అందుబాటులో ఉండే విధంగా అవకాశం కల్పిస్తానన్నారు. సంఘాన్ని ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా ముందుకు తీసుకెళ్తానన్నారు. మధ్య తరగతి వారికి చెందిన ఎల్‌టి లోన్లను అందించి సహాయ సహకారాలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం సీఈవో సాకి వెంకటేశ్వర్లు సంఘ సభ్యులు సంఘ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డీపీఓ అకస్మిక తనిఖీ

నవతెలంగాణ-చివ్వేంల



మండలంలోని బండమీది చందుపట్ల గ్రామాన్ని డీపీవో సురేష్ కుమార్ శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. అనంతరం గ్రామపంచాయతీలోని రికార్డులను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో గ్రామపంచాయతీ సిబ్బంది చేస్తున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. వారి వెంట ఎంపీవో గోపి,పంచాయతీ కార్యదర్శి చలమయ్య గ్రామపంచాయతి సిబ్బంది ఉన్నారు.

ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి

- తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలి
- ఎండిపోయిన పంటలకు నష్టపరిహారం చెల్లించాలి
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి

నవతెలంగాణ-సూర్యాపేట



యాసంగి ధాన్యం చేతికి వచ్చినందున అన్ని గ్రామాల్లోనూ ఐకేపీ కేంద్రాలు ఏర్పాటు చేయాలని సిపిఐఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక మల్లు వెంకట నరసింహారెడ్డి భవన్ లో నిర్వహించిన పార్టీ జిల్లా కార్యదర్శి వర్గం సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం మూలంగా రైతులు మధ్య దళారులకు అమ్మాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. దీంతో గిట్టుబాటు ధర లభించక రైతాంగం తీవ్రంగా నష్టపోతున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. వర్షాభావంతో ఇప్పటికే సగం వరి చేలు ఎండిపోయాయన్నారు. ప్రభుత్వం తక్షణమే నిర్ణయించిన మద్దతు ధరల బ్యానర్ పెట్టాలని కోరారు. బోనస్ కూడా ఈ రబీలో ఇవ్వాలని కోరారు. జిల్లాలో అనేక గ్రామాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. కలెక్టర్ వెంటనే ప్రత్యేక సమావేశం నిర్వహించి తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉన్న గ్రామాలలో అద్దె బోర్లా ద్వారా ప్రజలకు తాగునీరు అందే విధంగా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. జిల్లాలో వేలాది ఎకరాలలో సాగునీరు లేక పంటలు ఎండిపోయిందని, ఎండిపోయిన వరి పంటకు ఎకరాకు 25 వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో తీవ్ర కరువు పరిస్థితుల ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం వెంటనే కరువు మండలాలను ప్రకటించి రైతులను ఆదుకోవాలని కోరారు. పేదలని ఆదుకునేందుకు ఉపాధి హామీ పనులు ప్రారంభించి 200 రోజులు ఉపాధి పని ఇవ్వాలన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా రోజు కూలిరూ.600 ఇవ్వాలని కోరారు. జిల్లాకార్యదర్శి వర్గ సభ్యులు కో లిశెట్టి యాదగిరిరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు, మట్టిపల్లి సైదులు, కోట గోపి పాల్గొన్నారు.

నగదు రూ.50వేలకు మాత్రమే అనుమతి

- సీజ్ అయిన నగదు గ్రీవెన్స్ కమిటీ ద్వారా పొందవచ్చు
- కలెక్టర్ ఎస్ వెంకట్రావు

నవతెలంగాణ-సూర్యాపేట కలెక్టరేట్



ఎన్నికల నియ మావళి అమలులోకి వచ్చిన నేపథ్యంలో రూ.50వేల లోపు నగదును మాత్రమే తీసుకెళ్లేందుకు అనుమతి ఉంటుందని కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ తెలిపారు.శుక్రవారం కలెక్టరేట్ లో సీజ్ అయిన నగదు విడుదల కోసం గ్రౌండ్ ఫ్లోర్ లోని జి 38 రూమ్ నందు గ్రీవెన్స్ కమిటి కార్యాలయం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆధారాలు లేకుండా ఎక్కువ మొత్తంలో నగదు తీసుకుని వెళ్లవద్దని ప్రజలకు సూచించారు. నిబంధనలు అతిక్రమించి ఎక్కువ మొత్తం లో నగదు దొరికితే ఆ మొత్తాన్ని సీజ్ చేసి జిల్లా ట్రెజరీలో జమ చేస్తారని తెలిపారు. ఒక వేల రూ.10 లక్షలపైగా ఎక్కువ నగదు పట్టుబడి విడుదల కోసం సంబంధిత ఆదాయపు పన్ను అధికారులకు తెలియ పరిచి నగదు విడుదల కోసం నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోబడునని అన్నారు. అత్యవసరంగా తీసుక వెళ్లే డబ్బులకు అధికారులకు ఆధారాలు నగదు డ్రా చేసిన అకౌంట్ పుస్తకం లేదా ఏటీఎం చీటి, వస్తువులు, ధాన్యం విక్రయ నగదు అయితే సంబంధిత బిల్లు, భూమి విక్రయించిన సొమ్ము అయితే డాక్యు మెంట్లు, వ్యాపారం సేవల నగదు అయితే లావాదేవీలు వివరాలు చూపించాల్సి ఉంటుందని తెలిపారు.ఆధారాలు లేక సీజ్ అయిన నగదు విషయమై అప్పీలు, ఆధారాలు పొంది దరఖాస్తు చేసుకోవడానికి కలెక్టరేట్ లోని జిల్లా గ్రీవెన్సు కమిటీ కార్యాలయం ఏర్పాటు చేయనైనదని కలెక్టర్ తెలిపారు.జిల్లా గ్రీవెన్స్ కమిటీ ఇంచార్జి జడ్పీ సీ ఈ ఓ వి వి అప్పారావు, నెంబర్ :8374566222 ని సంప్రదించాలన్నారు.ఈ కార్యక్రమం లో డి ఆర్ డి ఓ మధుసూదన్ రాజ్, జడ్పీ డిప్యూటీ సీఈఓ శిరీష,ఎఓ సుదర్శన్ రేడ్డి, శ్రీనివాస రాజు, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు రుణమాఫీ చేయాలి

నవతెలంగాణ-గరిడేపల్లి



రైతులకి రెండు లక్షల రుణ మాఫీ చెయ్యాలి అని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి యస్ కే యాకూబ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండల పరిధిని కితవారిగూడెం గ్రామంలో గ్రామంలో సీపీఐ(ఎం) జనరల్ బాడీ సమావేశంలో పాల్గొని అయన మాట్లాడారు. పంట పోయి నష్టపోయిన రైతాంగానికి నష్టపరిహారం ఇవ్వాలని వేల రూపాయలు పెట్టి రైతులు బోర్లు ఎంచుకున్న భూగర్భ జలాలు 2005 అడుగుల కోట మూలాన బోర్లన్ని ఫెయిల్ అయి కొద్ది మాత్రమే పంటకు చేతికి రావడం మూలాన రైతులు అనేక అవస్థలు పడ్డారని గత పాలకులు రైతులను పట్టించుకోవడం మూలాన వారు ఈరోజు ప్రతిపక్షంలో కూడా కూర్చుని పరిస్థితి లేకుండా దివాలా తీశారని యాకూబ్ అన్నారు ప్రభుత్వాలు ఎప్పుడూ రైతులు కార్మికులు నిరుద్యోగుల పట్ల శ్రద్ధ వహించి వారి సమస్యలు పరిష్కారం చేసినట్లయితే ప్రజలు ప్రభుత్వానికి అనుకూలంగా ఉంటారని అన్నారు వెంటనే రైతు రుణమాఫీ రెండు లక్షల రైతు రుణమాఫీ చేసి పంట నష్టపోయిన వారికి నష్టపరిహార ఇవ్వాలని ఈ కార్యక్రమంలో బొల్లెపల్లి శ్రీనివాస్ తుమ్మల సైదయ్య జుట్టు కొండ వెంకటేశ్వర్లు యల్లావల నారాయణ మాజీ సర్పంచ్ రాచమల్ల రామస్వామి దోసపాటి బిక్షం బొమ్మ కంటి అంకయ్య పాల్గొన్నారు.

రుణమాఫీ హామీని అమలు చేయాలి

- సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు భూక్య పాండు నాయక్

నవతెలంగాణ-మఠంపల్లి



కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన రుణమాఫీ హామీని వెంటనే అమలు చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు భూక్య పాండు నాయక్, మండల కార్యదర్శి మాలోతుబాలు నాయక్‌లు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ విషయమై శుక్రవారం మఠంపల్లి మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ రుణమాఫీ కాకపోవటంతో రైతాంగం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల హామీ ప్రకారం 2 లక్షల లోపు రుణాలు అన్నింటిని మాఫీ చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుబంధు డబ్బులు కేవలం మూడు ఎకరాలకు మాత్రమే ఇచ్చారని మిగిలిన రైతులకు రైతుబంధు విడుదల చేయాలని కోరారు. ఈసమావేశంలో మండల కమిటీ సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు ఎస్ జగన్ మోహన్ రెడ్డి, సయ్యద్ రన్ మియా, కే వెంకట్ రెడ్డి, పొడిచెట్టి రాము, పొదిలి రవి, చల్ల లింగయ్య, బి శంబయ పాల్గొన్నారు.

సరిహద్దుల్లో పకడ్బందీగా తనిఖీలు నిర్వహించాలి

- జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే

నవతెలంగాణ-కోదాడరూరల్



పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా రాష్ట్ర సరిహద్దుల్లో పకడ్బందీగా తనిఖీలు నిర్వహించాలి అని జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే, ఎన్టీఆర్ జిల్లా డీసీపీ శ్రీనివాసరావులు అన్నారు. పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం రాష్ట్ర సరిహద్దుల్లో ఉన్న రామాపురం క్రాస్ రోడ్, గరికపాడు చెక్పోస్టులను తనిఖీలు చేసి వారు మాట్లాడారు. ఇప్పటివరకు నగదు, జిల్లాలోని అన్ని చెక్పోస్టులలో ఇప్పటివరకు రూ.84 లక్షల వరకు నగదు, మద్యం ని పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. రెండు రాష్ట్రాల పోలీసులు సమన్వయంతో పనిచేయాలని వారు అన్నారు. దీనికోసం బోర్డర్ మీటింగ్ ని కూడా ఏర్పాటు చేశామని తెలిపారు. చెక్పోస్ట్ లలో 24 గంటలు తనిఖీలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నందిగామ ఏసీపి రవి కరణ్ ,రూరల్ సీఐ రజిత రెడ్డి, జగ్గయ్యపేట సీఐ జానకిరామ్, ఎస్సై లు అనిల్ రెడ్డి, రాంబాబు, సతీష్, రెండు రాష్ట్రాల పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్యం రూ.472.94 లక్షలు.. వసూలు రూ.3.58 లక్షలు

- ఒక్కశాతం కూడా కానీ స్త్రీనిధి లోన్ల వసూళ్లు
- నారాయణగూడెం వివోఏపై చర్యలు శూన్యం
- సభ్యులే నిర్ణయించుకోయివాలి-డీఆర్డీఓ పీడీ మధుసుదన రాజు

నవతెలంగాణ-పెన్‌పహాడ్



ఆర్థికంగా ఎదగాలని భావించే మహిళలకు స్త్రీనిధి వరంగా మారింది. తక్కువ వడ్డీతో రుణాలు అందిస్తూ గ్రామీణ ప్రాంత పేద మహిళలకు ఆసరాగా నిలుస్తోంది. 2011 అక్టోబర్ 8న నాటి రాష్ట్ర ప్రభుత్వం స్త్రీనిధి సంస్థను ఏర్పాటు చేసింది. నాటి నుంచి పెద్దఎత్తున రుణాలిచ్చే కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. ఇదే తరహాలో మండలంలోని పేద మహిళలు రుణాలు అందచేశారు. అయితే ఈ విధంగా అందచేసిన రుణాలను తిరిగి చెల్లించడంలో సంబందిత రుణాలు తీసుకున్న మహిళలు విఫలమవుతున్నారో లేక అధికారుల మాయాజాలమో తెలియడం లేదు. గత 2023 మార్చిలో 2024 మార్చి వరకు రూ.472.94 లక్షలు వసూలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే వాళ్ళు వసూలు చేసింది కేవలం రూ. 3.58 లక్షలు మాత్రమే అంటే వసూలు అయిన మొత్తం లక్ష్యంలో కేవలం 0.75 శాతం మాత్రమే. అయితే గ్రామాల్లో రుణాలు తీసుకున్న మహిళలు వారి రుణాలను కడుతూ వచ్చినా కొంతమంది వివోఏ(విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్)లు, అధికారులు చేతివాటం చూపించి సంబందిత అకౌంటులో జమచేయకుండా స్వంత ఖర్చులకు వాడుకుంటూ కాజేశారని గుసగుసలు వినపడుతున్నాయి.

వివోఏల పాత్ర కీలకం

స్త్రీనిధి పథకం ద్వారా లబ్దిపొంది ఆర్థికంగా నిలదొక్కుకోవాలనే ప్రతి మహిళ సంఘంలో చేరి రుణ సహాయంతో ఏదో ఒక వ్యాపారం ప్రారంభించి తన కాళ్లమీద తాను నిలబడే స్థాయికి ఎదుగుతున్నారు. ఈ విధంగా తీసుకున్న రుణాలు పొందటంలో, రుణాలను వాయిదాల పద్దతిలో చెల్లించడంలో వివోఏల పాత్ర కీలకంగా ఉంటుంది. ప్రతినెల వివోఏలు డబ్బులు వసూలు చేసి సంబంధిత లోన్ అకౌంటులో జమ చేస్తారు. ప్రతినెల వివోఏల వసూళ్లను సీసీలు క్లస్టర్ల వారీగా పర్యవేక్షిస్తారు. వీటిని మండల స్థాయిలో ఏపిఎం పర్యవేక్షిస్తారు. ఇంతమంది అధికారులు పర్యవేక్షిస్తున్నా.. కనీసం ఏర్పాటు చేసుకున్న లక్ష్యానికి 1 శాతం కూడా వసూలు కాకపోవడం పలు ప్రశ్నలకు తావిస్తుంది.

నారాయణగూడెం వివోఏపై చర్యలు శూన్యం

గత సంవత్సరం అక్టోబర్ నెలలో గ్రామస్థుల వినతి మేరకు, ఉన్నతాధికారులఆదేశాల మేరకు మండలంలోని నారాయణగూడెం గ్రామంలో 24 మహిళా సంఘాలు 152 సంఘాల సభ్యులతో బహిరంగ విచారణ నిర్వహించారు. ఈ బహిరంగ విచారణలో రూ.15 లక్షల 17 వేల నగదును బ్యాంకులలో జమ చేయకుండా వివోఏ సొంత ఖర్చులకు వాడుకున్నట్లు బహిర్గతమైంది. గ్రామస్తులు, మహిళా సంఘాల బాధ్యులు వివోఏ కుర్రి ప్రమీలను నిలదీశారు. దాంతో నెల రోజుల్లో నగదు మొత్తాన్ని జమ చేస్తానని లిఖిత పూర్వకంగా హామీ ఇవ్వడంతో అధికారులు గ్రామం నుండి వెన్ను తిరిగారు. నేటికీ వాటిని తిరిగి జమ చేయకపోక, సదరు వివోఏపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో ఈ కుంబకోణం వెనుక ఎంతమంది పెద్దమనుషుల పేర్లు ఉన్నాయోనన్న అనుమానాలకు వ్యక్తమవుతున్నాయి.

సభ్యులే నిర్ణయించుకోయివాలి: డీఆర్డీఓ పీడీ మధుసుదన రాజు

వివోఏలను స్థానిక సంఘాల సభ్యులే ఎన్నుకుంటారు కాబట్టి సభ్యులే నిర్ణయించుకోవాలని, వివోఏ అక్రమాలకు పాల్పడితే సంబంధిత బాధిత సభ్యులు సదరు వివోఏపై క్రిమినల్ కేసు ఫైల్ చేయాల్సి ఉంటుంది. పోలీసులు అక్రమాలకు పాల్పడిన వివోఏ నుండి డబ్బును రికవరి చేస్తారు. అంతేకాక సభ్యులందరు సమావేశం ఏర్పాటు చేసుకుని నూతన వివోఏను ఎన్నుకునే వేసులుబాటు కూడా ఉంది.

తెలంగాణ వైద్య ఆరోగ్యశాఖ నిబంధనలకు లోబడి పని చేయాలి

నవతెలంగాణ-సూర్యాపేట

జిల్లాలోని ప్రవైట్ హాస్పిటల్స్ వారు తెలంగాణ వైద్య ఆరోగ్యశాఖ నిబంధనలకు లోబడి పని చేయాలని డీఎంహెచ్ఓ డాక్టర్ కోటాచలం అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో పలు హాస్పటల్ లో తనిఖీల్లో భాగంగా స్థానిక మధుబాబు హాస్పిటల్‌లో ఆయన తనిఖీలు నిర్వహించి మాట్లాడారు. జిల్లా కేంద్రంలో అధిక సిజేరియన్ కాన్పులు చేస్తున్న పలు ఆసుపత్రుల పై వరుస దాడులు చేసినట్టు తెలిపారు. ఇందులో భాగంగా సిజేరియన్ కాన్పులు, అబార్షన్ రికార్డులను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఇప్పటి వరకు 8 ఆసుపత్రుల్లో అధికంగా సిజేరియన్ కాన్పులు చేసినట్టు గుర్తించడం జరిగిందని తెలిపారు.నార్మల్ కాన్పులు జరిగే అవకాశమున్నా సిజేరియన్ కాన్పు చేస్తున్నారన్న అనుమానం పై సోదాలు నిర్వహించినట్టు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలు ఆసుపత్రులకు నోటీసులు ఇవ్వడం జరిగిందని తెలిపారు.

వెంకన్న మృతి పార్టీకి తీరని లోటు

నవతెలంగాణ-చిలుకూరు

కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకుడు వడ్రానపు వెంకన్న(55) గుండెపోటుతో శుక్రవారం మరణించడం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు కీత వెంకటేశ్వర్లు అన్నారు. ఈ సందర్భంగా ఆయనకు బజ్జూరి వెంకటరెడ్డి వట్టికూటి నాగయ్య బజ్జూరి ప్రభాకర్ రెడ్డి వట్టికూటి ధన మూర్తి సైదబాబు ఆనందరావు బిట్టు అంతయ్య తాళ్లూరి శ్రీను అక్కినపల్లి జానకి రామాచారి తదితరులు సంతాపం ప్రకటించారు.

ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మురళీధర్ రెడ్డి బదిలీని నిలిపి వేయాలి

నవతెలంగాణ-సూర్యాపేట



ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మురళీధర్ రెడ్డి అక్రమ బదిలీని వెంటనే నిలిపి వేయాలని హాస్పిటల్ ఉద్యోగులు,సిబ్బంది డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఏరియా ఆసుపత్రి వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమంలో వారు మాట్లాడారు. రాజకీయ జోక్యంతోనే మురళీధర్ రెడ్డి ని బదిలీ చేశారని ఆరోపించారు. భార్యా భర్తలకు లక్షలాది రూపాయల వేతనాలు ప్రైవేట్ ఆస్పత్రిలో వస్తాయని కానీ వారు మాత్రం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో పేదలకు తమ విలువైన సేవలను అందించారని గుర్తు చేశారు. అర్ధరాత్రి అపరాత్రి లేకుండా సేవలు అందించిన ఘనత డాక్టర్ మురళీధర్ రెడ్డికే దక్కుతుందన్నారు.కరోనా సమయంలో వెలకట్టలేని వైద్య సేవలు అందించి ఎందరోకో ప్రాణదాతగా నిలిచారని పేర్కొన్నారు. రాజకీయ స్వార్థ ప్రయోజనాలను అడ్డుకుంటాడనే అక్రమ బదిలీ అని వారు తెలిపారు. మెడికల్ కళాశాలకు భూముల సేకరణలో మురళీధర్ రెడ్డిది ప్రధాన పాత్ర అని ఆయన లేకుంటే మెడికల్ కళాశాల పూర్తయ్యేది కాదన్నారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు ఏరియా ఆసుపత్రికి చేరుకొని బదిలిని నిలిపి వేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.అనంతరం పోలీసులు జోక్యం చేసుకోవడంతో వారు నిరసన విరమించారు.

పల్లెల్లో దాహం కేకలు కథనానికి స్పందన

నవతెలంగాణ-చివ్వేంల

పల్లెల్లో దాహం కేకలు కథనం నవతెలంగాణ దినపత్రికలో ప్రచురించడం జరిగింది. కథనానికి స్పందించిన సూర్యాపేట జిల్లా కలెక్టర్ వెంకట్రావు,వారి ఆదేశాల ప్రకారం మండలంలోని ఐలాపురం, గాయం వారి గూడెం గ్రామపంచాయతీలలో ఆర్డిఓ వేణుమాధవ్ పర్యటించారు. తాగునీటి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పిడబ్ల్యూ ఎస్ స్కీం బోర్ మోటార్లను పరిశీలన చేసి మాట్లాడారు. గ్రామాల్లో నీటి సమస్యలు రాకుండా ఎప్పటికప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వారి వెంట తహసీల్దార్ కృష్ణయ్య, ఎంపీడీవో సంతోష్ కుమార్, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను సద్వినియోగం చేసుకోండి

- మండల పశువైద్యాధికారి డాక్టర్ నరేష్

నవతెలంగాణ-తుంగతుర్తి



పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా పాడి రైతులు వ్యాధి నివారణ టీకాలను వేయించాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ నరేష్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కర్విరాల గ్రామంలో ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు.ఈ మేరకు మొత్తం 108 పశువులకు టీకాలు వేసినట్లు తెలిపారు.3 నెలల వయసు పైబడిన పశువులన్నింటికీ ఉచితంగా టీకాలు ఇస్తామని చెప్పారు. ప్రజాప్రతినిధులకు,పశు పోషకులకు సమాచారం ఇచ్చి చాటింపు చేయించి గ్రామాలకు ఉదయాన్నే వెళ్లి పశువులకు టీకాలు వేయడం జరుగుతుందన్నారు.పశువులకు గాలికుంటు వ్యాధి ప్రమాదకరమైందని,ఈ వ్యాధి సోకిన పశువుల నోటిలో, కాళ్లలో పుండ్లు ఏర్పడి మేత మేయక,నడవలేక నీరసిస్తాయన్నారు.పాడి పశువుల్లో పాల ఉత్పత్తి పడిపోతుందన్నారు.వ్యాధి సోకిన పశువులకు చికిత్స చేయకుంటే మరణిస్తాయన్నారు.పశుపోషకులు పశువులకు వ్యాధి నివారణ టీకాలు వేయించి వ్యాధులు సోకకుండా కాపాడుకోవాలని వైద్యాధికారి కోరారు.ఈ కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ రవి, గోపాలమిత్ర శ్రీనివాస్ రెడ్డి,పాడి రైతులు తదితరులు పాల్గొన్నారు.

కేజ్రీవాల్ అరెస్టు ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు

నవతెలంగాణ-సూర్యాపేట కలెక్టరేట్

ఆమ్‌ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్,ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌ను అరెస్టు చేయడం అంటే ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే అని ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ అధికార ప్రతినిధి సూరారపు పరీక్షిత్ రాజ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అత్యంత ప్రజాదరణ పొందిన క్రేజీవాల్ ఢిల్లీలో అత్యంత నాణ్యమైన ఉచిత విద్య, వైద్యం అందిస్తున్న నాయకుడు అని, అలాంటి వ్యక్తిపై అవినీతిని అంటగట్టాలని బిజెపి మోడీ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా చేస్తున్నటువంటి కుట్రలో భాగమే ఈ అరెస్టులు అని ఆయన తెలిపారు. బిజెపికి ప్రత్యామ్నాయ జాతీయ పార్టీగా ఆమ్ ఆద్మీ పార్టీ విస్తరించడంతోపాటు,భావి భారత ప్రధాని గా అరవింద్ కేజ్రీవాల్ ను దేశ ప్రజలు కోరుకుంటున్నారనే ఉద్దేశంతో బిజెపి మోడీ ఈడిని అడ్డం పెట్టుకొని కేజ్రీవాల్ ను అరెస్టు చేశారని తెలిపారు. వెంటనే అరవింద్ కేజ్రీవాల్ ను విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిచో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-మోతే

నేడే మండల సర్వసభ్య సమావేశం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో హరి సింగ్ నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు వివిధ మండల శాఖ అధికారి సకాలంలో హాజరు కావాల్సిందిగా కోరారు.

నీటిని పొదుపుగా వినియోగిద్దాం

నవతెలంగాణ-నూతనకల్

ప్రతి నీటి బొట్టును పొదుపుగా వినియోగిస్తూ రక్షించుకోవాలని తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో సునీతాలు అన్నారు శుక్రవారం మండల కేంద్రంలో అంతర్జాతీయ జల దినోత్సవ సందర్భంగా నీటిని పొదుపు చేస్తామని మండల పరిషత్, రెవెన్యూ సిబ్బంది ప్రమాణం చేశారు. నీటిని పొదుపు చేయడం కోసం భూగర్భంలో కలిసే విధంగా మండల పరిషత్ కార్యాలయం ముందు ఇంకుడు గుంటను తవ్వకం పనులను ప్రారంభించారు.. ఈ కార్యక్రమంలో ఈ ఏపీ ఓ శ్రీరాములు, వైద్య ఆరోగ్య సిబ్బంది ,టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ , రెవిన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తాళం పగలగొట్టి ఇంట్లో చోరీ

నవతెలంగాణ-చిలుకూరు

తాళం పగలగొట్టి ఇంట్లో చోరీకి పాల్పడిన ఘటన శుక్రవారం చిలుకూరు మండల పరిధిలోని బేతవోలు గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్ఐ సురభి రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని బేతవోలు గ్రామానికి చెందిన మోదుగు విమలమ్మ భర్త అంజిరెడ్డి ఇంటిని సోమవారం తాళం వేసి ఉండడంతో తాళం పగలగొట్టి ఇంట్లో ఉన్న ఐదు తులాల బంగారం 10 తులాల వెండి ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు దొంగలించిపోయారని చిలుకూరు పోలీస్ స్టేషన్లో పిటిషన్ ఇవ్వగా ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి శుక్రవారం ముగ్గురు దొంగలను కోదాడకు చెందిన వారిగా గుర్తించి కేసు నమోదు చేసి కోర్టుకు పంపించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పశువులకు నీరు అందుబాటులో ఉంచాలి

నవతెలంగాణ-పెన్‌పహాడ్



వేసవిలో పశువులకి నీరు అందుబాటులో ఉంచాలని జిల్లా పంచాయతీ అధికారి సురేష్ కుమార్ అన్నారు. మండల పరిధిలోని అనంతారం గ్రామంలో శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన నర్సరీని పరిశీలించారు. ఈ సంవత్సరం మొక్కలు నాటడం కోసం మొక్కలను సిద్ధం చేయాలని, ప్రతిరోజు మొక్కలకు నీరు పెట్టాలని, మరియు నర్సరీలోని మొక్కలు షిఫ్టింగ్ మరియు గ్రేడింగ్ చేయాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీలో చేతిపంపు పని చేస్తుందా లేదా అని పరిశీలించి, పశువుల తొట్టిలో నీళ్ల నింపడం పరిశీలించారు. శుక్రవారం గ్రీన్‌డేలో భాగంగా మొక్కలకి నీరు కొట్టి, పంచాయతీ పరిధిలోని ఉన్న అన్ని మొక్కలకి, ప్రకృతి వనాలలోని మొక్కలకు నీరు కొట్టాలని సూచించారు. గ్రామ పంచాయతీలోని ప్రజలకి త్రాగునీటి సమస్య రాకుండా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి దొడ్డి నరేష్, పంచాయతీ కార్యదర్శి రాజేష్, పంచాయతీ సిబ్బంది, పాల్గొన్నారు.

మహిళ మెడలో పుస్తెల తాడు చోరీ

నవతెలంగాణ-కోదాడరూరల్

మహిళ మెడలో పుస్తెలతాడు చోరీ అయిన ఘటన మండల పరిధిలోని ద్వారకుంట గ్రామ శివారులో శుక్రవారం చోటుచేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ద్వారకుంట గ్రామానికి చెందిన శిరంశెట్టి సరస్వతి అనే మహిళ గేదెల కాసుకొని తిరిగి తన గ్రామం వైపు వెళ్తున్న క్రమంలో మార్గమధ్యంలోని అశోక్ లేలాండ్ షోరూం జాతీయ రహదారి 65 వద్ద ఇద్దరు వ్యక్తులు స్కూటీపై వచ్చి మహిళా మెడలో ఉన్న నాలుగు తులాల పుస్తెలతాడు లాక్కున్నారు. దీంతో బాధితురాలు కేకలు వేయడంతో పుస్తెలతాడుతో అక్కడి నుంచి పరారు అయ్యారు. ఆమె ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్సై అనిల్ రెడ్డి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మద్యానికి బానిసై వ్యక్తి మృతి

నవతెలంగాణ-పెన్‌పహాడ్

మద్యానికి బానిసై వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని పెద్దసీతారాం తండాలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్ఐ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం తండాకు చెందిన బానోతు శ్రీను(58) గత కొన్నేళ్లుగా మద్యానికి పూర్తిగా బానిసయ్యాడు. దానితో ప్రతీరోజు లాగానే మద్యం సేవించి ఇంటిలో నిద్రించాడు. మృతుని భార్య అర్ధరాత్రి సమయంలో లేచి మృతునిలో చలనం లేకపోవడంతో తడిమి చూడగా మరణించినట్లు నిర్ధారించుకున్నారని, మృతుని పెద్దకొడుకు రమేష్ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతునికి వివాహం జరిగిన ఇద్దరు కొడుకులు ఒక కుమార్తె ఉన్నారు.

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

నవతెలంగాణ-పెన్‌పహాడ్

పంటలు ఎండి నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని చీదెళ్ల ఎంపీటీసీ సభ్యులు జూలకంటి వెంకటరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. మండలంలో వివిధ గ్రామాలలో, తండాలలో రైతులు వరిసాగు చేయగా చేసిన పొలాలు పూర్తిస్థాయిలో ఎండిపోయాయని ప్రభుత్వ అధికారులు అంచనావేసి రైతులకు నష్టపరిహారం చెల్లించాలని ఆయన పేర్కొన్నారు. పాలకుల అవగాహన రాహిత్యంతోనే రైతులు రోడ్డున పడ్డారని ధ్వజమెత్తారు. గత ప్రభుత్వం హయాంలో మొన్నటి వరకు జాలువారిన పంట పొలాలు నేడు బీడు భూములుగా మారాయని ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు నష్టపోయిన పంటను అంచనా వేసి రైతులకు నష్టపరిహారం చెల్లించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

అనధికారికంగా మట్టి తవ్వకాలు జరపొద్దు

నవతెలంగాణ-చింతలపాలెం

అనధికారంగా మట్టి తవ్వకాలు జరప కూడదని తాసీల్దార్ సురేందర్ రెడ్డి విలేకరులతో ఒ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని పులిచింతల ప్రాజెక్టు ముంపు గ్రామాలైన పాత వెల్లటూరు, తమ్మారం కృష్ణ పరివాహ ప్రాంతంలో అనధికారిక భూతవ్వకాలు జరిపినట్లు తమ దృష్టికి వచ్చిందని, దీనివల్ల కాండూర్ లైన్‌లో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉన్నందున ముంపు గ్రామ ప్రజలు అనధికారిక త్రవ్వకాలు జరపకూడదు అన్నారు. పులిచింతల ప్రాజెక్టులో అనధికారిక త్రవ్వకాలు జరిపినచో చట్టపరమైన తగు చర్యలు తీసుకొనబడునని అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ షేక్ బీబీ ఆసియా తెలిపారన్నారు.

శ్రీ శాలివాహన చక్రవర్తి జయంతి



నవతెలంగాణ-భువనగిరి

శాలివాహన చక్రవర్తి జయంతిని భువనగిరి పట్టణ మొల్లమాంబ చౌరస్తా వద్ద మరియు బాబు జగ్జీవన్ రావ్ చౌరస్తా వద్ద భువనగిరి కుమ్మర సంఘం కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ కుమ్మరి సంఘం అధ్యక్షులు తాడూరు అంజయ్య మాట్లాడుతూ కుమ్మర్లకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. ప్రభుత్వం జిల్లాలో రెండు ఎకరాల స్థలాన్ని పూర్తి దారులకు కేటాయించాలని, సబ్సిడీ అధునాతన యంత్రాలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు తాడూరు చంద్రయ్య ,మాజీ కౌన్సిలర్ తాడూరు బిక్షపతి తాడురు నరసింహ్మా తాడూరు మల్లేష, తాడూరు బాల మల్లేశ్, తాడూరు బాల శంకర్, తాడూరు కృష్ణ, వడిచర్లకృష్ణ, కుమ్మరి సంఘం మహిళలు జయంతి కార్యక్రమంలో పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయాన్ని తరలించాలి



నవతెలంగాణ-భువనగిరి

ఎలిమినేటి లక్ష్మమ్మ నర్సారెడ్డి ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో కొన్ని సంవత్సరాలుగా కేంద్రీయ విద్యాలయం నడుస్తున్నదని వెంటనే తరలించాలని నోడల్ అధికారి రమణి జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. కేంద్రీయ విద్యాలయం నూతన భవనం పాఠశాల పనులు పూర్తయి ఆరు నెలలు అయిందన్నారు. అయినా కళాశాల ఆవరణ నుండి తరలించడం లేదని ఆవేదన వ్యక్తపరిచారు. దీంతోవిద్యార్థులకు అసౌకర్యంగా ఉందన్నారు. కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపల్ కళాశాల ప్రిన్సిపాల్ పట్ల అసభ్యంగా మాట్లాడుతున్నారని ఆరోపించారు. ఇంటర్ వార్షిక పరీక్షలు వ్రాయు విద్యార్థులను ఇబ్బందులు గురిచేస్తున్నట్లు తెలిపారు. వెంటనే కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్‌పై చర్య తీసుకోవాలని, కేంద్రీయ విద్యాలయాలను తరలించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

ఎన్నికల ఏర్పాట్లపై ఆకస్మిక తనిఖీ



నవతెలంగాణ-ఆలేరుటౌన్

ఆలేరు నియోజకవర్గం కేంద్రంలో శుక్రవారం ఎన్నికల అధికారి ఆర్‌ఓ గంగాధర్ పార్లమెంటు ఎన్నికల పనితీరును, పట్టణంలోని స్టేడియంలో ఏర్పాట్లను, ఎన్నికల ఉపాధికారి, తహసిల్దార్ శ్రీనివాస్ రెడ్డితో కలిసి పరిశీలించారు. మండల వ్యాప్తంగా పోలింగ్ కేంద్రాల వద్ద పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఏర్పాట్ల సందర్భంగా తీసుకోవలసిన తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యల గురించి పలు సూచనలు చేశారు. ఆలేరు తాసిల్దార్ కార్యాలయం భారత ప్రభుత్వం లోక్సభ ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ చేయడంతో, భువనగిరి పార్లమెంట్ సెగ్మెంట్ ,ఆలేరు అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో రానున్న పార్లమెంట్ ఎన్నికల కేంద్రంగా మారింది. పార్లమెంట్ ఎన్నికల కొరకు విస్తృతంగా ముమ్మరంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. రూట్లో ప్రైవేట్ వాహనాలు ఏర్పాటు చేయడం, పోలింగ్ ఏజెంట్లు, పోలింగ్ అధికారి ఏర్పాటు ప్రక్రియ కొనసాగుతుంది. తాసిల్దార్ కార్యాలయం వద్ద ఎన్నికల ఏర్పాట్లతోపాటు రోజువారిగా జరిగే రిజిస్ట్రేషన్ లతోపాటు, అధికారులతో వివిధ పనుల నిమిత్తం వచ్చేవారు గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఆలేరు నియోజకవర్గం లోని 3 వందల తొమిది బూతుల గాను ఆలేరు, రాజపేట, మోటకొండూరు, యాదగిరిగుట్ట, ఆత్మకూరు, గుండాల, తుర్కపల్లి, బొమ్మలరామరము మండలాలలో చురుకుగా ఏర్పాటు జరుగుతున్నాయి. హైదరాబాద్ వరంగల్ జాతీయ రహదారిపై వాహనాలను పోలీసులు క్షుణ్ణంగా ముమ్మర తనిఖీలు చేస్తున్నారు. వాహనాల ఏర్పాటు, ఫోటో వీడియోల చిత్రీకరణ, అయా మండలాల్లో ఎన్నికల అధికారులు,సిబ్బంది ఏర్పాటు ప్రక్రియ ముమరంగ సాగుతుంది. ఈపరిశీలన కార్యక్రమంలో డిఎల్‌ఓ శ్రీకాంత్ రెడ్డి, డిప్యూటీ తహసిల్దార్ వి ప్రదీప్, ఆర్‌ఐ నరేంద్ర చారి, సత్యనారాయణ రెడ్డి, సినియర్ అసిస్టెంట్ కే క్రిష్ ట్, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



26న సీపీఐ(ఎం) భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గస్థాయి సమావేశం

- పార్లమెంట్ నియోజకవర్గ సీపీఐ(ఎం) అభ్యర్థి ఎండి.జహంగీర్

నవతెలంగాణ-చౌటుప్పల్

ఈ నెల 26న సీపీఐ(ఎం) భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ సమావేశం జిల్లా కేంద్రంలోని ఏఆర్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహిస్తున్నట్టు పార్లమెంట్ నియోజకవర్గ సీపీఐ(ఎం) అభ్యర్థి, పార్టీ జిల్లా కార్యదర్శి ఎండి.జహంగీర్ తెలిపారు. శుక్రవారం పట్టణ కేంద్రంలోని కందాల రంగారెడ్డి స్మారక భవనంలో ఆ పార్టీ చౌటుప్పల్ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గానికి సీపీఐ(ఎం) పోటీ చేస్తున్న సందర్భంగా ఈ నెల 26న భువనగిరి, ఇబ్రహీమ్‌పట్నం, ఆలేరు, జనగాం, మునుగోడు, నకిరేకల్, తుంగతుర్తి నియోజకవర్గాల ముఖ్య నాయకత్వంతో సమావేశం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సమావేశానికి పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ.రాఘవులు, కేంద్రకమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య, జూలకంటి రంగారెడ్డి, మల్లు లక్ష్మీ పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశంలో పార్లమెంట్ ఎన్నికల్లో తీసుకోబోయే భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ మండలకార్యదర్శి గంగదేవి సైదులు, జిల్లాకమిటీ సభ్యులు ఎమ్‌డి.పాషా, బూర్గు కృష్ణారెడ్డి, గడ్డం వెంకటేశ్, నాయకులు గోశిక స్వామి, అవ్వారు గోవర్ధన్, బాలరాజు, కొంతం శ్రీనివాస్‌రెడ్డి, బద్దం అంజయ్య, బోయ యాదయ్య పాల్గొన్నారు.

ఆగమవుతున్న రైతుల బతుకులు

- వట్టిపోతున్న బోర్లు.. ఎండిపోతున్న యాసంగి పంటలు

నవతెలంగాణ-భువనగిరి

యాసంగి సాగు చేసిన రైతుల బతుకులు ఆగమవుతున్నాయి. రోజురోజుకు వందలాది ఎకరాల పంట ఎండిపోతున్నాయి. భూగర్భ జలాలు అడుగంటి బోర్లన్నీ వట్టి పోతున్నాయి. కరువుకోరల్లో చిక్కుకొని అన్నదాతలు విలవిలలాడుతున్నారు. గడ్డి లేక జీవాలు తల్లడిల్లుతున్నాయి. ఎండిన పంటలు పోను పొట్ట దశకు వచ్చిన వరిపంటనైనా ఇంటిని తీసుకెళ్తామనుకున్న రైతుపై ప్రకృతి కన్నెర్ర చేసింది. జిల్లా వ్యాప్తంగా 2 లక్షల 93 వేల 232.01 ఎకరాలలో వరి సాగు చేశారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం 5,143 ఎకరాల పంటలు ఎండిపోయాయి. వాస్తవంగా క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే పదివేల ఎకరాల పంట ఎండిపోయి రైతులకు తీవ్ర నష్టాన్ని చేకూర్చాయి. మరో ఐదు నుండి పదివేల ఎకరాల పంట ఎండిపోయే అవకాశం ఉంది. ఎండిన పంటలకు కొందరు రైతులు నిప్పు పెడుతుంటే మరికొందరు రైతులు పశువులను మేపుతున్నారు. యాసంగి 2023-24 సంవత్సరానికి గానూ మండలాల వారీగా రైతులు వేసిన పంట, ఎండిపోయిన పంటలు ఎకరాలలో..

మండలం	వేసిన పంట (ఎకరాల్లో)	ఎండిన పంట (ఎకరాల్లో)
1. అడ్డగూడూరు	11,368.14	150
2. ఆలేరు	11,305.30	68
3. ఆత్మకూర్ (ఎం)	19,690.14	81
4. గుండాల	14,295.36	220
5. మోత్కూరు	10,465.30	200
6 పోచంపల్లి	28,656.05	54
7. భువనగిరి	21,792.12	450
8. బీబీనగర్	13,852.12	40
9. చౌటుప్పల్	14.724.20	625
10.నారాయణపురం	9,775.28	750
11.రామన్నపేట	28,640.28	210
12.వలిగొండ	40,801.34	1050
13.బొమ్మలరామారం	9,880.13	250
14. మోట కొండూర్	13,515.32	220
15. రాజాపేట	16,605.09	485
16. తుర్కపల్లి	15,480.24	140
17. యాదగిరిగుట్ట	12,380.13	150
జిల్లా మొత్తం	2,93,232.01	5,143

సర్కారు ఆదుకోవాలి..

భూగర్భ జలాలు అడుగంటి బోర్లన్నీ వట్టిపోయి పంటలు ఎండిపోతున్న విపత్కర పరిస్థితుల్లో రాష్ట్ర సర్కారు రైతులకు భరోసా కల్పించవలసి ఉంది. ఆ భరోసా కరువైంది. ప్రభుత్వం సరైన అంచనా వేసి నష్టపరిహారం చెల్లించడంలో వెనుకంజ వేయడం బాధాకరమని ఆవేదన వ్యక్తపరుస్తున్నారు. పంట నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.



నివేదికలు పంపుతున్నాం: జిల్లా వ్యవసాయశాఖ అధికారి అనురాధ

యాసంగిలో భూగర్భ జలాలు అడుగంటడంతో పంటలు ఎండిపోయాయని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అనురాధ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ఎండిపోయిన పంట నష్టం వివరాలు రాష్ట్ర వ్యవసాయ శాఖకు నివేదికలు పంపుతున్నామని యాదాద్రి భువనగిరి జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అనురాధ తెలిపారు.



పశువుల పాకలో శుభ్రత తప్పనిసరి

నవతెలంగాణ-ఆలేరుటౌన్

రైతులు పశువులపాకలో పరిసరాల పరిశుభ్రతతో పాటు, పశువులను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా పశుసంవర్ధకశాఖ వైద్యాధికారి డాక్టర్ సదానందం అన్నారు. మండలంలోని మంతపురి గ్రామంలో శుక్రవారం మండల పశు వైద్యాధికారులు డాక్టర్ చైతన్య డాక్టర్ నవీన్ రెడ్డి ఆధ్వర్యంలో ఉచిత గాలికుంటు నివారణ టీకాలు అందించారు. ఈ సందర్భంగా హాజరైె రైతులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. 253 పశువులకు టీకాలు వేయడం జరిగిందని డాక్టర్ చైతన్య తెలిపారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ వైద్య సిబ్బంది రామస్వామి, సుధాకర్, గోపి రైతులు పాల్గొన్నారు.

ప్రాంతీయ పార్టీలను కబలించే కుట్ర

నవతెలంగాణ-ఆలేరు టౌన్

ప్రధాని దేశ నాయకుడిగా కాకుండా, గల్లీ నేతగా వ్యవహరిస్తున్నారని బీఆర్‌ఎస్ రాష్ట్ర మహిళా నాయకురాలు, మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునితమహేందర్ రెడ్డి అన్నారు. ఎలాంటి సాక్షాధారాలు లేకుండా కవితపై నింద వేయడం సరికాదన్నారు. ప్రాంతీయ పార్టీలను కబలించే కుట్ర జరుగుతోందని, దేశాన్ని దోచుకున్నోళ్లకు చేయూతనిచ్చిందే మోదీ అని గొంగిడి సునీత విమర్శించారు. మోదీ వచ్చే ముందు ఈడీ, సీబీఐ వస్తాయని విమర్శించారు. మోదీ పాలన దేశం భ్రష్టు పట్టిందని అన్నారు. మహిళలను ఉద్యమం వైపు మళ్లించింది కవితే అని ఆమె పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో కవితది ప్రత్యేక స్థానమని స్పష్టం చేశారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-అడ్డగూడూరు

మండల పరిధిలోని డి రేపాక గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన సూరారం ఎల్లమ్మ కుటుంబానికి కృషి యూత్ క్లబ్ ఆధ్వర్యంలో రూ.13 వేల ఆర్థిక సాయం చేశారు. నిరుపేద కుటుంబానికి ఆర్థిక సాయం చేసిన కృషి యూత్ క్లబ్ కి రాపాక గ్రామస్తులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కృషి యూత్ క్లబ్ వ్యవస్థాపక సభ్యులు ముక్కాముల లింగమల్లు, ఉపాధ్యక్షులు గొలుసుల నరేష్, కోశాధికారి, మొల్యాపురి ప్రశాంత్, యూత్ సభ్యులు గ్రామస్తులు,తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల కరపత్రం విడుదల

నవతెలంగాణ-మోత్కూర్

ఈనెల 24 నుండి ప్రారంభం కానున్న శ్రీ రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవ కార్యక్రమాల కరపత్రాలను శుక్రవారం మోత్కూర్ మున్సిపల్ చైర్ పర్సన్ గుజ్జం కవితా లక్ష్మీనర్సింహ్మారెడ్డి విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. ఈ నెల 24 ఆదివారం రాత్రి తెల్లవారు జామున స్వామి వారి కళ్యాణం తో మొదలై ఏప్రిల్ 1 తేదీన దీపోత్సవంతో ముగిసే బ్రహ్మోత్సవ కార్యక్రమాలల్లో భక్తులు పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.ఆలయ అభివృద్ధికి అన్ని రకాలగా సహకరిస్తానని హామీ ఇచ్చారు . ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బొల్లేపల్లి వెంకటయ్య, ఆలయ కమిటీ చైర్మన్ గుండగోని రామ చంద్రు గౌడ్, సభ్యులు బుర్ర యాదయ్య, ఉయ్యాల అంజయ్య, బొల్లేపల్లి సీతయ్య, బీసు యాదగిరి, మొరిగాల రాజయ్య, పన్నాల శ్రీనివాస్ రెడ్డి, రంగయ్య, పాల్గొన్నారు.

ఆలయంలో సీసీ కెమెరాల ఏర్పాటు

నవతెలంగాణ-మోత్కూర్

శ్రీ రామలింగేశ్వర ఆలయంలో గత కొన్ని ఏండ్లుగా పండుగలు, జాతర సమయంలో ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి పలు మార్లు చోరీకి పాల్పడుతుండడంతో ఆలయ ఆవరణలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు చోటుచేసుకోకుండా ఉండేందుకు, ఆలయ పవిత్రతను కాపాడేందుకు మోత్కూర్ పట్టణ కేంద్రానికి చెందిన ఎస్ఆర్ఐ, నియో స్పోర్ట్స్ క్లబ్ యజమాని పోచం నారాయణ, మోత్కూర్ అభివృద్ధిని కాంక్షించి రూ.25 వేల విలువ గల సీసీ కెమెరాలను ఆలయంలో ఏర్పాటు చేశారు. దీంతో మోత్కూరు పట్టణ ప్రజలు పోచం నారాయణను అభినందించారు.

భువనగిరి పార్లమెంట్ టికెట్ మేం కోరలేదు

- మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి



నవతెలంగాణ-చౌటుప్పల్ రూరల్

భువనగిరి పార్లమెంట్ టికెట్ తాము కోరలేదని, ఆ టికెట్ ఎవరికైనా ఇవ్వండని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. శుక్రవారం మునుగోడు క్యాంప్ కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కోమటిరెడ్డి లక్ష్మికి ఎంపీ టికెట్ కోరుతున్నామని కొన్ని పత్రికలలో, ఛానల్లో వస్తున్న ప్రచారం అవాస్తవమన్నారు. బీసీ అభ్యర్థికి టికెట్ ఇవ్వాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా అని చెప్పారు. బీసీ నాయకుడికి భువనగిరి ఎంపీ టికెట్ ఇస్తే రాష్ట్రంలోనే భువనగిరి ఎంపీగా భారీ మెజార్టీతో గెలిపిస్తామని చెప్పారు. కోమటిరెడ్డి లక్ష్మికి ఎంపీ టికెట్ కావాలని కోరడం లేదని రాజగోపాల్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ అధిష్టానం ఎవరిని నిర్ణయించినా భువనగిరి ఎంపీగా గెలిపిస్తామని కోమటిరెడ్డి బ్రదర్స్‌గా తమ హామీని నిలబెట్టుకుంటామన్నారు. కోమటిరెడ్డి బ్రదర్స్ ఎప్పుడు పదవులను ఆశించలేదని, నామినేటెడ్ పదవులు కావాలని కోరినట్టు చరిత్రలోనే లేదని రాజగోపాల్ రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్రం సాధించడం కోసం కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మంత్రి పదవిని త్యాగం చేశాడని గుర్తు చేశారు. కోమటిరెడ్డి బ్రదర్స్‌కి పదవులు ముఖ్యం కాదని, ప్రజలను కుటుంబ సభ్యులుగా చూసుకోవడమే తమ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ ఛాంబర్స్ చైర్మన్ వెన్ రెడ్డి రాజు చౌటుప్పల్ ఎంపీపీ తాడూరి వెంకట్ రెడ్డి సంస్థాన్ నారాయణపురం ఎంపీపీ గుత్తా ఉమా ప్రేమ్ చందర్ రెడ్డి చౌటుప్పల్ సింగిల్విండో చైర్మన్ చెన్నగోని అంజయ్యగౌడ్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆకుల ఇంద్రసేనారెడ్డి మండల అధ్యక్షుడు బోయ దేవేందర్ చౌటుప్పల్ కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షుడు సుర్వి నరసింహా గౌడ్ తదితరులు పాల్గొన్నారు

వివాదంగా మారిన పంచాయతీ భవన నిర్మాణం

- ఏడు సంవత్సరాల కింద ప్రభుత్వ నిధులతో పనులు
- స్థలం తనదేనంటూ కట్టడాన్ని పోల్చేసిన ఓ వ్యక్తి
- ఉన్నతాధికారుల వద్దకు చేరిన ఫిర్యాదులు

నవతెలంగాణ-రాజపేట

మండలపరిధిలోని పాముకుంట గ్రామంలో ఏడు సంవత్సరాల క్రితం ప్రభుత్వ నిధులతో గ్రామపంచాయతీ కార్యాలయం కోసం చేపట్టిన నిర్మాణ స్థలం తనదేనంటూ రంగ బాలస్వామి అనే వ్యక్తి కూల్చివేయడంతో సమస్య మొదలై పరిధిలు దాటి జిల్లా అధికారులు, పోలీసుల వద్దకు చేరింది. దీంతో గ్రామంలో ఆందోళన వాతావరణం నెలకొంది. వివరాల్లోకి వెళితే రాజపేట మండలం పాముకుంట గ్రామంలో 2017లో అప్పటి సర్పంచి జన్నేపల్లి జ్యోతి, కార్యదర్శి గనగాని శంకర్ గౌడ్, పాలకవర్గం ఫిబ్రవరి 20వ తేదీన చేసిన తీర్మాణం ప్రకారం రంగ బాలస్వామికి చెందిన సుమారు 227 గజాల ఇంటి స్థలంలో గ్రామపంచాయతీ భవన నిర్మాణం చేపట్టాలని తీర్మాణం చేసి, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా రూ.13 లక్షలు మంజూరు అయినట్లు కాగితాలు చెబుతున్నాయి. ఆ సమయంలో ఉపేందర్ అనే వ్యక్తి కాంట్రాక్టర్‌గా నిర్మాణం పనులు సుమారు రూ.1.7 లక్షలతో పనులు అయినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. అందుకు సంబంధిత బ్యాంకు ఉపాధి కూలీల వివరాలు డబ్బులు డ్రా చేసిన వివరాలను ఆధారాలతో పలువురు గ్రామస్తులు తెలియజేశారు. అప్పటి పంచాయతీరాజ్ డిప్యీఈ వెంకటేశ్వర 30 మార్చి 2017లో డబ్బులు మంజూరి చేసినట్లు సంబంధిత ఆధారాలు అందజేశారు. అట్టి నిర్మాణాన్ని ఇటీవల గ్రామపంచాయతీ రికార్డులో పేరు వస్తున్న రంగ బాలస్వామి స్థలం తనదేనంటూ ధ్వంసం చేశారు. ఈ విషయంపై గ్రామస్తులు పోలీస్ స్టేషన్లో మరియు జిల్లా కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారి, ఎంపీడీవో, ఎంపీఓ, గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారి, గ్రామపంచాయతీ కార్యదర్శులకు ఫిర్యాదులు చేశారు. సంబంధిత ఆధారాలను గ్రామస్తులు వారికి అందజేశారు. గ్రామపంచాయతీ ఆస్తిని, ప్రభుత్వ నిధులతో ధ్వంసం చేసిన వారిపై కేసులు నమోదు చేయాలని, గ్రామపంచాయతీ స్థలాన్ని కాపాడాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ఈనెల 23వ తేదీన రాజపేట మండల పరిషత్ జనరల్ బాడీ సమావేశం లో వినత్పత్రం అందజేసి న్యాయం జరిగే వరకు పోరాడుతామని గ్రామస్తులు హెచ్చరిస్తున్నారు. ఈ విషయంపై గ్రామపంచాయతీ కార్యదర్శి లక్ష్మణ్ ను వివరణ కోరగా గ్రామపంచాయతీ రికార్డులో రంగబాల స్వామి పేరు ఉందని, అట్టి స్థలంలో జాతీయ ఉపాధి హామీ పథకం నిధుల ద్వారా నిర్మాణం జరిగిందని ఇట్టి విషయాన్ని అధికారులకు తెలియజేసినట్లు చెప్పారు. ఇటీవల పోలీసులు కూడా సంఘటన స్థలానికి వచ్చి విచారణ చేపట్టినట్టు కార్యదర్శి చెప్పారు.

అనాథ విద్యార్థుల ఉన్నత చదువులకు ఆర్థిక చేయూత



నవతెలంగాణ-బొమ్మలరామారం

మండల కేంద్రంలోని తెలంగాణ స్టేట్ మోడల్ పాఠశాలలో చదువుతున్న, నిరుపేద అనాథ విద్యార్థులైన ధీరావత్ నితిన్ పదవ తరగతి, రమావత్ గౌతమి పదవ తరగతి, రామావత్ వరుణ్ 9వ తరగతి, రమావత్ దీవి ఆరవ తరగతి లకు ఉన్నత చదువులకై ఆర్థిక అవసరాలకు కేమ్ టె కే ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఎండి శివ ప్రసాద్ కస్తూరి లక్ష రూపాయలు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేర్చుకో సంపాదించు, సేవచే అనే నినాదంతో సేవా కార్యక్రమాలు ప్రతి సంవత్సరం ప్రభుత్వ పాఠశాల కళాశాలలో చదివే విద్యార్థులకు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుధీర్ రెడ్డి, సతీష్, జగన్మోహన్‌రావు, ప్రిన్సిపాల్ శోభారాణి, ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

నవతెలంగాణ-వలిగొండరూరల్

మండలంలోని అరూర్ కు చెందిన చిలుకమర్రి శ్రీనివాసచారి ఇటీవల అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందడంతో వారికి ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన 34 వేల రూపాయల చెక్కును శుక్రవారం డిసిసి ఉపాధ్యక్షులు వాకిటి అనంతరెడ్డి శుక్రవారం అందజేశారు.ఈ కార్యక్రమంలో బుర్ర నర్సింహా, వెలిమినేటి సురేష్,సుంకిశాల పరమేష్, బండారు నర్సింహారెడ్డి, కొడితల కరుణాకర్, దామెర అంజయ్య, బత్తిని వెంకటేష్, కేదారి నరేష్, రెబ్బసు నరేష్, పులగల స్వామి, జావీద్ పాషా పాల్గొన్నారు.

చామలకు ఎంపీ టికెట్ రావాలి

నవతెలంగాణ-భువనగిరి

కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం పనిచేసిన సామల కిరణ్ కుమార్ కు భువనగిరి ఎంపీ టికెట్ రావాలని కోరుతూ స్థానిక జహంగీర్ పీర్ దర్గాలో కాంగ్రెస్ పార్టీ నాయకులు వీరే కార్ శ్రీను ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు ఎండీ కరీం, నరేంద్ర, రమేష్, పండు, నర్సింహా, సందేశ్, లక్కాన్, రాహుల్ పాల్గొన్నారు.



రక్తదాన శిబిరం ఏర్పాటు

నవతెలంగాణ-మోత్కూర్

హీరో శ్రీ లక్ష్మీ మోటార్స్ మోత్కూర్ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణ కేంద్రంలో ఎస్ఎం ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన మెగా సర్వీస్ ఎక్స్ఛేంజ్ కార్నివాల్ మూడవరోజులో భాగంగా రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్రీ లక్ష్మీ మోటార్స్ అధినేత మెట్టు మంగేష్ గణేష్ లు మాట్లాడుతూ. అత్యవసర పరిస్థితుల్లో చాలామంది రోగులు రక్తం అందక చనిపోవడం జరుగుతుందని నీ మెగా సర్వీస్ ఎక్స్చేంజ్ కార్నివాల్ లో మా వంతు సహాయం కింద రక్తదానం ఇవ్వడానికి చాలామంది ముందుకు వచ్చారని ప్రతి ఒక్కరు రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ మండల అధ్యక్షులు ఓ సత్య నాథ్, జిల్లా డైరెక్టర్ పి శ్రీనివాస్ రెడ్డి, డైరెక్టర్స్ సిహెచ్ అనిల్, ప్రవీణ్ కుమార్, బుస్స రవి,సభ్యులు చంద్రారెడ్డి,సుబ్రహ్మణ్య శర్మ మచ్చేందర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణమూర్తి-కుసుమ దంపతులకు సన్మానం



నవతెలంగాణ-చౌటుప్పల్

చౌటుప్పల్ పట్టణకేంద్రంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయంలో శుక్రవారం కౌన్సిలర్లు సందగల్ల విజయసతీశ్‌గౌడ్, పోలోజు శ్రీధర్‌బాబు ఆధ్వర్యంలో ఉప్పల కృష్ణమూర్తి-కుసుమ దంపతులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ చౌటుప్పల్ పట్టణకేంద్రంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయంలో మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా 50 సంవత్సరాలుగా శ్రీ సీతారామచంద్రస్వామి కల్యాణాన్ని తాము సొంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌ఛైర్మన్ బత్తుల శ్రీశైలంగౌడ్, దేవాలయకమిటీ ఛైర్మన్ బొబ్బిళ్ల మురళి, గోశిక స్వామి, దాచేపల్లి ప్రకాశ్, బడుగు లక్ష్మయ్య, మాణిక్యం, గుజ్జుల సురేందర్‌రెడ్డి, ముత్యాల భూపాల్‌రెడ్డి, హనుమంతురెడ్డి, వీసం చంద్రారెడ్డి, దేవరపల్లి గోవర్ధన్‌రెడ్డి, చింతకింది అంజయ్యగౌడ్, తొర్పునూరి మల్లేశ్‌గౌడ్, వెంకటేశ్, ఎరుకలి మల్లేశ్‌గౌడ్, పోలోజు శ్రీనివాస్‌చారి, నల్ల పర్వతాలు, మునుకుంట్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

ఖాతాలను ఫ్రీజ్ చేయడం బీజేపీ పిరికిపంద చర్య

- యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి మందుల సురేష్

నవతెలంగాణ-మోత్కూరు

బీజేపీ తమ దగ్గర ఉన్నటువంటి ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా ప్రతిపక్ష పార్టీ అయినా కాంగ్రెస్ పార్టీ ఖాతాలను ఫ్రీజ్ చేయడం బీజేపీ పిరికిపంద చర్యని, ప్రజాస్వామ్యాన్ని కూని చేయడమే అని యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి మందుల సురేష్‌అన్నారు. శుక్రవారం మోత్కూర్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ దేశవ్యాప్తంగా రాహుల్ గాంధీ, చేస్తున్నటువంటి న్యాయి యాత్ర ద్వారా వస్తున్న ఆదరణ చూసి ఓర్చుకోలేక నరేంద్ర మోడీ, అమిత్ షా నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ ఖాతాలను ఫ్రీజ్ చేయడం వల్ల కాంగ్రెస్ పార్టీ గెలుపును అడ్డుకోలేరని రానున్నది కాంగ్రెస్ పార్టీ అని కేంద్రంలో కచ్చితంగా కాంగ్రెస్ పార్టీ విజయ డంకా మోగించి రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేయాలని ప్రతి ఒక్కరు కోరుకుంటున్నారని, కార్పొరేటర్లకు తొత్తులుగా వ్యవహరిస్తూ రౌడీ రాజ్యం పేరుతో మాత్రమే బిజెపి పాలన కొనసాగిస్తుందని ప్రతి ఒక్క నిరుద్యోగికి రైతులకు, మహిళలకు, అన్ని వర్గాల ప్రజలకు అర్థమైందని ఆ భయంతోటి కాంగ్రెస్ పార్టీ బ్యాంకు ఖాతాలను అడ్డుకున్నారని అన్నారు.

కొనసాగిన ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం

నవతెలంగాణ-రాజాపేట



ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం మూడవరోజు శుక్రవారం రాజాపేట మండలం రఘునాథపురం గ్రామంలో వివిధ కార్యక్రమాల యోజన జరిగింది. ఉదయం వ్యక్తిత్వ వికాసంలో భాగంగా యోగ, సూర్యనమస్కార్, ఆసనాలు, వ్యాయామం అభ్యాసం చేసారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ కమటం రమేష్ మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన శరీరం నుండి అనుకూలమైన ఆలోచనలు వస్తాయన్నారు యోగ ద్వారా మనిషి సంపూర్ణ ఆయుషు పొందగలుగుతాడన్నారు. ఈఅల్పాహారం అనంతరం రఘునాథపురం,చిన్నగౌరాయపల్లి గ్రామాల్లో ఇంటింటి సర్వే నిర్వహించారు . ఈ సర్వేలో ప్రభుత్వం నుండి అందాల్సిన పథకాలు అందరికి అందుతున్నాయా లేదా అనే నివేదిక తీసుకున్నారు. బడి ఈడు వయసు ఉండి బడికి వెళ్ళని విద్యార్థులు వివరాలు సేకరించారు .18 సంవత్సరాల వయసు ఉండి ఓటు హక్కు నమోదు చేసుకొని యువతకి అవగాహన కల్పించారు.

చలివేంద్రం ప్రారంభం



నవ తెలంగాణ -నూతనకల్

మండల పరిధిలోని లింగంపల్లి అడ్డరోడ్డు వద్ద తేజస్విన్ త్రీడీ బోర్ పాయింట్ డిక్టేటర్ కాశ శంకర్ యాదవ్ తన సొంత ఖర్చులతో శుక్రవారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రారంభించారు అనంతరం వారు మాట్లాడుతూ అన్ని దానాలలో నీటి దానం మహా గొప్పదని ఆలోచన తో నాలుగు రోడ్ల కూడలిలో ఎటువంటి నీటి సదుపాయం లేని ఈ ప్రదేశంలో ప్రయాణికులు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామని దీనిని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు ఈ కార్యక్రమంలో తోనుకునూరి రమేష్,పర్వతపు హరీష్ ,మచ్చ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

నీటిని వృథా చేయొద్దు

నవతెలంగాణ- చివ్వేంల



నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని, ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతను ఏర్పాటు చేసుకుని భూగర్భ జలాలను పెంచుకోవాలని ఎంపీడీవో సంతోష్ కుమార్, తహసీల్దార్ కృష్ణయ్య సూచించారు. శుక్రవారం అంతర్జాతీయ జల దినోత్సవం సందర్భంగా స్థానిక మండల ప్రజా పరిషత్తు కార్యాలయంలో సామూహిక ఇంకుడు గుంతను పరిశీలించి జల ప్రతిజ్ఞ చేసి మాట్లాడారు . ఇంట్లో వాడుకున్న నీటిని మురికికాల్వ లోకి పోనివ్వకుండా ఇంకుడుగుంత ను నిర్మించుకొని భూగర్భ జలాలను పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో గోపి, ఏపీఓ నాగయ్య, ఉపాధి హామీ సిబ్బంది, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాటేసిన కరువు.. ఎండుతున్న వరిచేలు

- అడుగంటిపోతున్న భూగర్భజలాలు

నవతెలంగాణ-సంస్థాన్ నారాయణపురం





రైతన్నను కరువు కాటేసింది. కరువు కాటకు రైతు సాగు చేసిన వరి చేలు పొట్ట దశలో ఎండిపోతున్నాయి. మండలంలో కరువు కరాళ నృత్యం చేస్తోంది. రోజురోజుకు ఎండల తీవ్రత పెరగడంతో భూగర్భ జలాలు అరగంటి పోతున్నాయి. బోరుబావులకు నీరు అందక వట్టి పోతున్నాయి. పంట పొలాలు నీరందక నేర్రెలు భారీ నోళ్లు తెరుస్తున్నాయి. సాగు కోసం తెచ్చిన అప్పులు తీర్చేదెట్లా అని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. ఎండిపోతున్న వరి చేనును బతికించుకునేందుకు రైతులు ట్యాంకర్ల ద్వారా నీళ్ల పారిస్తున్నారు. తగిన నష్టపరిహారం అందజేసి ప్రభుత్వమే తమను ఆదుకోవాలని వేడుకుంటున్నారు. ఎండిన వరి చేనును గొర్రెల, పశువుల మేత కోసం అడ్డికి పావు షేరు చొప్పున అమ్ముకుంటున్నారు. మరి కొంతమంది రైతులు మరింత అప్పు అప్పు చేసి గొర్రెలను కొనుక్కొని ఎండిన చేను మేపుకుంటున్నారు. ఎండిన వరి చేను తిన్న గొర్రెలు తను తెచ్చిన అప్పులు తీర్చలేక పోతాయా అనే మొండి ధైర్యంతో వ్యవసాయాన్ని నెట్టుకొస్తున్నారు. మండలంలో బోరు బావుల కింద 9,628 ఎకరాలు వరి సాగు చేశారు. ఈ ఏడు కురవాల్సిన వర్షం కురవ లేదు. 507.5 మి.మి వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 499.5 మిల్లీమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదయింది. దీంతో వేసవికాలం ఆరంభంలోనే భూగర్భ జలాల అడుగంటి పోతున్నాయి. సాగు చేసిన వరిలో ఇప్పటికే ఎండిపోతున్నాయి. 548 ఎకరాలు ఎండిపోయినట్లు వ్యవసాయ అధికారులు ఉన్నతాధికారులకు నివేదికలు అందజేశారు. మరి కొన్ని ఎకరాల్లో వరి ఎండిపోయే అవకాశాలు ఉన్నాయని అధికారులు ధ్రువీకరిస్తున్నారు.

ప్రభుత్వమే ఆదుకోవాలి: రైతు ఎడ్ల శంకరయ్య



నాలుగున్నర ఎకరాలు సాగు చేసేందుకు రూ.2లక్షలు అప్పు చేశా. ఇప్పటికే 3 ఎకరాలు ఎండిపోయింది. మిగిలింది పండుతదో ఎండుతుందో తెలవదు. ఎండిన చేనులో కొంత గొర్రెల మేతకు అమ్మిన. మిగిలినది కొంత పశువులను మేపుతున్న తెచ్చిన అప్పు ఎట్లా తీర్చాలో తెలియడం లేదు. పెట్టుబడులైన ప్రభుత్వం చెల్లించి ఆదుకోవాలి.

మనసొప్పక ట్యాంకర్లతో నీళ్లు అందిస్తున్న :రైతు ఉప్పల శ్రీను



సాగు చేసిన పంట కళ్ల ముందే ఎండిపోతుంటే మనసొప్పక రోజుకు రూ.15 నుంచి 20వేలు ఖర్చు భరిస్తూ ట్యాంకర్ ద్వారా పొలానికి నీరు పోస్తున్న. నాలుగు ఎకరాల్లో ఆరు బోర్లు వేసిన రెండిట్లో నీళ్లు వచ్చినప్పటికీ వేసవి ఎండల తీవ్రతకు ఒకటి ఎండిపోయింది. మరొక దాంట్లో నీళ్ల తగ్గిపోయినాయి. రైతు బాధలను ప్రభుత్వం అర్థం చేసుకోవాలి.

వరిపంటలు ఎండిపోతున్నట్లు నివేదికలు పంపాం: ఇన్చార్జి వ్యవసాయ అధికారి ముత్యాల నాగరాజు



మండలంలో భోగర్భ జలలు అడుగంటి పోవడంతో రైతులు సాగి చేసిన వారిచేలు ఎండి పోతున్నాయి. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇప్పటికే మండలంలో 548 ఎకరాల్లో వరి పంట ఎండిపోయినట్లు ఉన్నతాధికారులకు నివేదికలకు పంపాం ప్రభుత్వ ఉన్నతాధికారుల సూచన మేరకు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి ప్రతి రైతుకు న్యాయం చేసే విధంగా కృషి చేస్తాం.



జీవకోటికి నీరే ప్రాణధారం..

- భవిష్యత్తు తరాలకోసం ప్రతి నీటి బొట్టును కాపాడాలి: కలెక్టర్ ఎస్.వెంకట్రావ్

నవ తెలంగాణ -సూర్యాపేట కలెక్టరేట్

జీవకోటికి నీరే ప్రాణధారమని జిల్లా కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ తెలిపారు. శుక్రవారం ప్రపంచ నీటి దినోత్సవ సందర్భంగా జిల్లా కలెక్టరేట్ ఉద్యోగులకు ఇంకుడు గుంతల నిర్వహణపై అవగహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అన్ని గ్రామాలు, మున్సిపాలిటీలో ప్రతి ఇంటిలో ఇంకుడు గుంత ఉంటేలా అధికారులు అవగహన కల్పించాలని తెలిపారు. మానవులు చేసిన తప్పిదం వల్ల నేడు నీటి సమస్యలు ఎదుర్కొంటున్నాం అని అన్నారు. నీటిని కొనుకొని తాగే స్థాయికి వచ్చామని, ఉన్న వనరులను జాగ్రత్తగా వాడుతూ భవితరాల భవిష్యత్తు కోసం ప్రతి నీటి బొట్టుని మనం కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రతి ఇంటిలో ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని, గ్రామ, మండల కేంద్రాలలో సముహిక ఇంకుడు గుంతలు విరివిగా నిర్మించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డివో మధు సూదన్ రాజ్, జెడ్పీ సీఈవో వి వి అప్పారావు ,మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, కలెక్టరేట్ ఏవో సుదర్శన్ రెడ్డి ,సూపరిటిడెంట్ పద్మారావు, ఎన్నికల పర్యవేక్షకులు శ్రీనివాసరాజ్, ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చెక్ పోస్టుల్లో గట్టి భద్రత: కలెక్టర్

అన్ని చెక్ పోస్టులలో గట్టి భద్రత చేపట్టినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్. వెంకట్రావ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో స్వాధీనం చేసుకున్న నగదు, బంగారు ఇతర వస్తువులు ట్రెజరీ స్ట్రాంగ్ రూమ్ లో భద్ర పరుచుట జరుగుతుందని ఆయన తెలిపారు. ఇప్పటివరకు నగదు రూ. 27.08 లక్షలు, మద్యం 1156 లిటర్లు, బంగారం 229 గ్రాములు వాటి విలువ రూ.15.48 లక్షలు అలాగే రెడీమేడ్ వస్తువుల విలువ రూ. 24.67 లక్షలు ఉంటుందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని అన్ని చెక్ పోస్టులలో గట్టి భద్రత ఏర్పటు చేయడం జరిగిందని ఆబ్కారీ శాఖ, ఎఫ్ఎస్టి, ఎస్ఎస్టి టీమ్స్ నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని అలాగే లిక్కర్ కేసులు ఎక్కువ నమోదు చేయాలని తెలిపారు. నగదు, బంగారం, వెండి, ఇతర వస్తువులు స్వాధీనం చేసుకున్న బాధితులు జి.38 గ్రీవెన్స్ సెల్ లో ఆధారాలు చూపితే అందచేస్తామని తెలిపారు.

నాలుగోసారి ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన గవ్వల సిద్ధేశ్వర్

నవ తెలంగాణ-రాజాపేట

బిజెపి ప్రధాన కార్యదర్శిగా గవ్వల సిద్దేశ్వర్ నాలుగోసారి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రాజపేట మండలంలోని బిజెపి రాష్ట్ర జిల్లా నాయకులు ప్రజాప్రతినిధులు కార్యకర్తలు అభిమానులు గవ్వల సిద్దేశ్వర్ స్వగ్రామమైన నమిల వాసులు ప్రత్యేకంగా అభినందించారు. సత్కరించారు. ఎవరే పార్టీలో అజాతశత్రువుగా కొనసాగుతున్న గవ్వల సిద్దేశ్వర్ పార్టీ అభివృద్ధి ప్రజల సమస్యల పరిష్కారం ఎన్నికల్లో బిజెపి అభ్యర్థి గెలుపు కోసం ఎనలేని కృషి చేస్తూ అందరి ప్రశంసలు పొందుతూ వస్తున్నాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృతజ్ఞతలు చెప్పారు.

ఎంపీ అభ్యర్థి దానంకుప్రసాదం అందజేత

నవతెలంగాణ-యాదగిరిగుట్టరూరల్



హైదరాబాద్ శుక్రవారం, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి దానం నాగేందర్ కు మల్లాపురం ఎంపీటీసీ కర్రె విజయ వీరయ్య కలిసి యాదగిరి గుట్ట లక్ష్మీనరసింహస్వామి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన లడ్డు ప్రసాదం అందజేసి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ శ్రీ యాదగిరి గుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆశీస్సులతో దానం నాగేందర్ పార్లమెంట్ ఎలక్షన్స్ లో అత్యధిక మెజారిటీతో విజయ డంక మోగిస్తారని ఆకాంక్షిస్తున్ననాని తెలిపారు.

తుంగతుర్తి బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా తాళ్లపల్లి సత్యనారాయణ

నవతెలంగాణ-తుంగతుర్తి

ఈనెల 20న నిర్వమించిన న్యాయవాదుల సర్వసభ్య సమావేశంలో తుంగతుర్తి బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా మండల కేంద్రానికి చెందిన న్యాయవాది తాళ్లపల్లి సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వైస్ ప్రెసిడెంట్‌గా రమావత్ పూల్ సింగ్ నాయక్,జనరల్ సెక్రెటరీగా ఎండి.పర్వీన్,జాయింట్ సెక్రెటరీగా మల్లెపాక రవికుమార్, కోశాధికారిగా ప్రతాప్ లు ఎన్నికయ్యారు.ఈ మేరకు అధ్యక్షుడు తాళ్లపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ ప్రస్తుతం కోర్టులో రెగ్యులర్ జడ్జి లేక అందరూ ఇబ్బందులు పడుతున్నారని న్యాయవాదుల సహకారంతో ఈ సమస్యను పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి రెగ్యులర్ జడ్జిని నియమించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు.తన ఎన్నికకు సహకరించిన తోటి న్యాయవాదులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌరవ సభ్యులు జిల్లా కుమారస్వామి,న్యాయవాదులు నాగరాజు,అనిల్ కుమార్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా, బెల్లం స్వాధీనం

నవతెలంగాణ-హుజూర్‌నగర్

జిల్లా ఎక్సైజ్ సూపరిండెంట్ ఆర్ లక్ష్మనాయక్ ఆధ్వర్యంలో శుక్రవారం నియోజకవర్గం పరిధిలోని మఠంపల్లి మండలం మరియు పాలకీడు మండలాలలో దాడులు నిర్వహించినట్లు ఎస్సై జగన్మోహన్ రెడ్డి తెలియజేశారు. నగర్ డిటిఎఫ్ సూర్యాపేట కోదాడ స్టేషన్ బృందాలు విస్తృతంగా దాడులు నిర్వహించాయన్నారు. మఠంపల్లి మండలంలోని కొత్త తండా పాత తండా బిలియా నాయక్ తండ శూన్యం పాడు అదేవిధంగా పాలకీడు మండలం లో జానపాడు తండా కల్మటి తండా పాలకీడులో దాడులు నిర్వహించామని తెలిపారు. ఈ దాడుల్లో నలుగురిపై కేసు నమోదు చేశామని 50 లీటర్ల నాటుసారా 40 కేజీల నల్ల బెల్లం ఎనిమిది వందల లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసినట్లు ఆయన తెలిపారు ల్లో ఎక్సైజ్ ఎస్సైలు ధనుంజయ నరేష్ రవి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సామల రామిరెడ్డికి సన్మానం

నవతెలంగాణ-హుజూర్‌నగర్

హుజూర్నగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన సామల రామిరెడ్డిని శుక్రవారం పలువురు న్యాయవాదులు ఆయన నివాసంలో గజమాలతో ఘనంగా సన్మానించారు ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు సాముల రామిరెడ్డి మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన న్యాయవాదులు అందరికీ ఆయన ధన్యవాదాలు తెలియజేశాడు న్యాయవాదుల సహకారంతో న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు అదేవిధంగా తాను అడగగానేనూతన కోర్టు భవనానికి రామస్వామి గట్టు వద్ద స్థలాన్ని మంజూరు చేసిన రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు నూతన కోర్టు భవన నిర్మాణానికి హైకోర్టు నుండి అనుమతులు తీసుకురావడానికి అదేవిధంగా భవన నిర్మాణానికి నిధులు మంజూరు కి తన వంతు కృషి చేస్తానన్నారు ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు నారపరాజు శ్రీనివాసరావు నట్టే సత్యనారాయణ అంబటి శ్రీనివాస్ రెడ్డి కోల రమాదేవి డాక్టర్ సుదర్శన్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

దేశాన్ని పరిపాలించిన శాలివాహన చక్రవర్తి

నవతెలంగాణ-కొండమల్లేపల్లి



క్రీస్తుపూర్వం 78 వ సంవత్సరం నుండి 138 సంవత్సరం వరకు శత్రువులపై యుద్ధం చేస్తూ భారతదేశాన్ని ఏలినటువంటి రాజు శాలివాహన మహారాజ్ చక్రవర్తి అనివైస్ ఎంపీపీ కాసర్ల వెంకటేశ్వర్లు శాలువాన సంఘం నియోజకవర్గ అధ్యక్షులు తోటపల్లి కిరణ్లు అన్నారు. శుక్రవారం శాలివాహన మహారాజు చక్రవర్తి జయంతి వేడుకల సందర్భంగా స్థానిక శాలివాహ భవన నిర్మాణం స్థలం నందు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి కుమ్మరులు ఘనంగా జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశాన్ని 60 ఏండ్లు ఏలిన చరిత్ర శాలివాహన చక్రవర్తి రాజధాని ప్రతి శాలివాహనులుడు కూడా ఆయనని ఆదర్శంగా తీసుకొని ముందుకు కొనసాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో శాలివాన సంఘం నాయకులు నీలకంఠం రాములు, బొడ్డుపల్లి మల్లయ్య, బొడ్డుపల్లి సైదులు, రాష్ట్ర యువజన అధ్యక్షులు ఎలిమినేట్ సాయి, మండల అధ్యక్షులు ఏరుకొండ రాము, బొడ్డుపల్లి శంకర్, మాడుగుల యాదగిరి, బొడ్డుపల్లి శంకర్, గణపురం శంకర్, తోటపల్లి కలమ్మ, తోటపల్లి వెంకటయ్య ,బొడ్డుపల్లి దశరథం, తోటపల్లి శ్రీను, బొడ్డుపల్లి మల్లేశం, బొడ్డుపల్లి నిరంజన్, కె. శ్రీను బత్తుల పరమేష్, బొడ్డుపల్లి ముత్యాలు, గణపురం యాదగిరి, విజయ్, ఏర్కొండ తిరుపతయ్య సైదులు, తోటపల్లి వెంకటేష్ తదితర కుమ్మర సంఘం పాల్గొన్నారు.

నందికొండ మున్సిపల్ చైర్‌పర్సన్‌గా అన్నపూర్ణ

- వైస్ చైర్‌పర్సన్‌గా ఆదాసు నాగ రాణి ఏకగ్రీవ ఎన్నిక

నవతెలంగాణ-నాగార్జునసాగర్

నందికొండ మున్సిపల్ నూతన చైర్‌పర్సన్‌గా 8వ వార్డు కౌన్సిలర్ తిరుమలకొండ అన్నపూర్ణ,వైస్ చైర్‌పర్సన్‌గా 6వ వార్డు కౌన్సిలర్ ఆదాసు నాగ రాణి విక్రమ్ లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్‌గా ఎన్నికైనట్లు ధ్రువీకరణ పత్రాన్ని శుక్రవారం ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి, మిర్యాలగూడ ఆర్డీవో శ్రీనివాస్ అందజేశారు. నందికొండ మున్సిపల్ చైర్‌పర్సన్ అనూష రెడ్డి,వైస్ చైర్‌పర్సన్ మంద రఘువీర్ పై ఫిబ్రవరి 15న ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు శుక్రవారం ఉదయం 11గంటలకు నూతన చైర్మెన్, వైస్‌చైర్మెన్ ఎన్నిక ప్రక్రియను ప్రత్యేక సమావేశం ద్వారా ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి ప్రారంభించారు.ఈ సమావేశంలో 8 మంది కోరం సభ్యులు ఈర్ల రామకృష్ణ,మోహన్ రావు,మంగత నాయక్,రమేష్ జి,శిరీష మోహన్ నాయక్,శ్వేతా రెడ్డి సమావేశానికి హాజరయ్యారు.అనంతరం నూతన చైర్‌పర్సన్,వైస్ చైర్‌పర్సన్‌గా ఎన్నికైన అన్నపూర్ణ,ఆదాసు నాగ రాణి ని కాంగ్రెస్ జెడ్పీ మాజీ వైస్ చైర్మెన్ కర్నాటి లింగారెడ్డి,తుమ్మలపల్లి శేఖర్ రెడ్డి , కాంగ్రెస్ శ్రేణులు సన్మానించారు.

ప్రజా సేవకోసం నిరంతరం శ్రమిస్తా :చైర్‌పర్సన్ అన్నపూర్ణ

ప్రజల సేవ కోసం నిరంతరం శ్రమిస్తానని నందికొండ మున్సిపాలిటీ నూతన చైర్‌పర్సన్ తిరుమలకొండ అన్నపూర్ణ అన్నారు. తనపై నమ్మకంతో ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించిన మాజీ మంత్రి జానారెడ్డి,ఎమ్మెల్యే జయవీర్ రెడ్డి,మాజీ జడ్పీ వైస్ చైర్మెన్ కర్నాటి లింగా రెడ్డి తో పాటు ఇందుకు సహకరించిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్యే ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయనని, ప్రజా సంక్షేమానికి తనవంతు ఎప్పుడూ కృషి చేస్తానని పేర్కొన్నారు.

ధ్వజస్తంభం శంకుస్థాపనకు హాజరైన మాజీ ఎమ్మెల్యే

నవతెలంగాణ- చిట్యాల టౌన్



మండలంలోని పిట్టంపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆంజనేయ స్వామి గుడి , ధ్వజస్తంభ శంకుస్థాపనకు నకిరేకల్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శ్రీ సీతారామాంజనేయ స్వామి దీవెనలు గ్రామస్తులకు ఎల్లవేళలా ఉండాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలోఎంపీపీ కొలను సునీత వెంకటేష్ గౌడ్,ఎంపీటీసీ దేవరపల్లి సత్తిరెడ్డి,మాజీ సర్పంచ్ ఈసం బాబు,బి ఆర్ ఎస్ గ్రామ శాఖ అధ్యక్ష, కార్యదర్శి బండారు ప్రభాకర్ రెడ్డి, మెట్టు కిరణ్ యాదవ్,పార్టీ నాయకులు కొమురెల్లి మోహన్ రెడ్డి, నాతి శ్రీనివాస్ గౌడ్, పైళ్ల రఘుమా రెడ్డి ,సింగిరెడ్డి గోపిరెడ్డి, మెట్టు నరేష్ యాదవ్, బండారు భరత్ రెడ్డి, మేడి ముత్యాలు, మేడి శ్రీకాంత్ , ప్రకాష్, కొమురెల్లి సంతోష్ రెడ్డి, ఊడుగు రవికుమార్, తుమ్మల నర్సిరెడ్డి, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

కబ్జాకు గురైన ప్లాట్లను కాపాడాలని బాధితుల ఆందోళన



నవతెలంగాణ-నార్కట్‌పల్లి

మండల పరిధిలోని గోపులాయపల్లి గ్రామ పరిధిలోగల శ్రీవారిజాల వేణుగోపాల స్వామి గుట్ట కింద గల వివిజిఎస్ వెంచర్(సర్వేనెంబర్ 301/ఆ) కబ్జాకు గురైన 32 ప్లాట్ల ను కాపాడాలని కోరుతూ శుక్రవారం భూ బాధితులు ఆ స్థలంలో ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ 2012 సంవత్సరంలో పోలోజు విక్రమ్ అనే బిల్డర్ వద్ద నుంచి సుమారుగా 32 మంది ప్లాట్ల యజమానులు కొనుగోలు చేశారు. కరోనా లాక్‌డౌన్ సమయంలో ప్లాట్ల వద్దకు బాధితులు వెళ్లలేక పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో కొంతమంది దళారులు ఒక ప్రభుత్వ ఉద్యోగికి తక్కువ ధరకు అమ్మేశారు. ఆ సమయంలో చిట్యాలకు చెందిన అల్లే శ్రీహరి మా స్థలాన్ని కబ్జాచేసి చింతా వేణుమాధవ్(చేవెళ్ల ఆర్డీఓ)అప్పటి సీఐ శంకర్‌రెడ్డి ముందు ఒప్పుకున్నారని పేర్కొన్నారు. ఈవిషయాన్ని ఎస్పీ పరిశీలనకు తీసుకొని వెళ్లగా ఎస్పీ మాట్లాడుకొని పరిష్కరించుకోండని చేప్పారని తెలిపారు. ఆరోజు నార్కట్ పల్లి పోలీస్ స్టేషన్లో సీఐ ముందు సదరు వేణుమాధవ్ రేపు వచ్చిమాట్లాడుతాను అని చెప్పి అక్కడి నుంచి వెళ్లిపోయారన్నారు. ఆ రోజు నుంచి మాతో ఎలాంటి సంప్రదింపులు జరపడం లేదనీ. పోలీసులు జోక్యం చేసుకొని సదరు వ్యక్తి ని పిలిపించి తమకు ప్లాట్లు మాకు ఇప్పించవలసిందిగా కోరారు. ఈ ఆందోళనలో రేగట్టె భూపాల్ రెడ్డి, సాయి కృష్ణ, వెంకటరమణ తదితరులు ఉన్నారు.

నగదు, మద్యం పట్టివేత

నవతెలంగాణ-కేతపల్లి

మండలంలోని 65వ నెంబర్ జాతీయ రహదారిపై కొర్లపాడు టోల్ ప్లాజా వద్ద శుక్రవారం తనిఖీలు నిర్వహిస్తుండగా అనధికారికంగా డబ్బును తీసుకువెళ్తున్న వ్యక్తి వద్ద నుండి నగదు రూ.70,000 పట్టుకొని సీజ్ చేశామని కేతపల్లి ఎస్సై శివతేజ చెప్పారు. మండలంలోని ఇనుపాముల గ్రామంలో చిత్తలూరి గోపయ్య అక్రమంగా మద్యాన్ని అమ్ముతుండగా 8.2 లీటర్ల మద్యమును సీజ్ చేసి కేసు నమోదు చేశామని ఎస్సై శివతేజ వివరించారు.

గీత కార్మికుని కుటుంబానికి మాజీ ఎంపీ ఆర్థిక సాయం

నవతెలంగాణ- తిరుమలగిరి



మండలంలోని గుండెపురి గ్రామంలో ఆదివారం గీత కార్మికుడు పాలకుర్తి వెంకన్న గౌడ్ గీత కార్మిక వృత్తితో జీవనం కొనసాగిస్తున్నాడు. ఇటీవల తాటి చెట్టు నుండి జారీ కిందపడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు ఈ విషయం తెలుసుకున్న భువనగిరి మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ శుక్రవారం వెంకన్న కుటుంబాన్ని పరామర్శించి 15000 రూ ఆర్థిక సహాయాన్ని వెంకన్న భార్య పాలకుర్తి పద్మ కూతురు మౌనికకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షులు పాలకుర్తి వీరయ్య పెద్దగౌడ్, పాలకుర్తి వెంకన్నమామిడి యాదగిరి, మెంచూ అశోక్, పులిపంపుల భద్రయ్య, మద్దెల సోమయ్య, మేంచు వెంకన్న, కాసగాని శ్రీను, పాలకుర్తి సోమయ్య, పాలకుర్తి ఉప్పలయ్య, పాలకుర్తి రవి, నామాల గురుమూర్తి, మెంచు రమేష్, చిరగాని వీరయ్య, పాలకుర్తి కనకయ్య, రెడ్డి మల్ల సైదులు, పాలకుర్తి ఎల్లాగౌడ్, కసగాని సోమేశ్, పాలకుర్తి పవన్ కుమార్, పాలకుర్తి సైదులు తదితరులు పాల్గొన్నారు.



గొర్రెలకు నష్టపరిహారం చెల్లించాలని వినతి

నవతెలంగాణ-తిరుమలగిరి

ఇటీవల వీధి కుక్కల దాడిలో మృతిచెందిన గొర్రెలకు ప్రభుత్వ నష్టపరిహారం ఇవ్వాలని జీఎంపీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్దార్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షులు కడెం లింగయ్య మాట్లాడుతూ వెలిశాల గ్రామంలో ఎల్లంల సమ్మయ్యకి చెందిన 35 గొర్రెలను వీధి కుక్కలు బుధవారం రాత్రి కొరికి చంపినాయన్నారు. ఆ గొర్రెలు చనిపోవడం వల్ల ఎల్లంల సమ్మయ్య కుటుంబం వీధిన పడే పరిస్థితి ఏర్పడిందన్నారు. కుక్కల దాడిలో చనిపోయిన గొర్రెల విలువ సుమారు మూడున్నర లక్షల రూపాయలు ఉంటుందన్నారు. ప్రభుత్వ ఉన్నత అధికారులు తక్షణమే స్పందించి సమ్మయ్య కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. ఈ మధ్యకాలంలో తూర్పు గూడెం గ్రామం తుంగతుర్తి మండలం లో ఒకే రాత్రి 120 గొర్రెలను కుక్కలు చంపిన ప్రభుత్వ ఇప్పటివరకు అధికారులు పట్టించుకోకపోవడం బాధాకరమైన విషయమన్నారు. వీధి కుక్కల వల్ల చనిపోయిన గొర్రెలకు తక్షణమే నష్టపరిహారం అందించి ఆ కుటుంబాలను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వం పై ఉన్నదన్నారు. ఈ కార్యక్రమంలో కడారి లింగయ్య, సమ్మయ్య, ఎల్లంల సతీష్, రాములు, తదితరులు పాల్గొన్నారు.



ప్రజలకు తాగునీటికి ఇబ్బందుల్లేకుండా చూడండి

- ఆకస్మికంగా సందర్శించిన జిల్లా సీఈఓ అప్పారావు

నవతెలంగాణ-అర్వపల్లి

గ్రామాల్లో మిషన్ భగీర నీరు కొంత తగ్గిందని, దీనివల్ల ప్రజలు నీటి సమస్యకు గురికాకుండా పైపుల లీకేజీ మోటార్లను బాగు చేసి ప్రజలకు తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలని జెడ్పీ సీఈవో అప్పారావు అన్నారు. మండలంలోని ఆయన గోపాలపురం భాగ్యనగరం గ్రామాలను సందర్శించి పరిశీలించారు. అర్వపల్లి ఆవాస గ్రామమైన గోపాలపురం సందర్శించారు. అక్కడ గ్రామ ప్రత్యేక అధికారి సందీప్ కుమార్ ద్వారా నీటిని సరఫరాను అందజేస్తున్నారు. ఆ విషయం తెలుసుకున్న జిల్లా అధికారి అక్కడికి చేరుకుని కాలనీ వాసిని వివరాలను మిషన్ భగీరథ నీరు ఎన్ని రోజుల నుండి రావడంలేదని మీరు రాకుంటే సమస్య పరిష్కరించాలని ఏఈ కి ప్రత్యేక అధికారికి తెలియజేశారు. భాగ్యనగని సందర్శించి అక్కడ నీటి సమస్యలను పరిశీలించారు. మండల జిల్లా వ్యాప్తంగా ప్రజలకు ఎక్కడ నీటి సమస్య ఉండకూడదని ప్రజలు నీటితో ఇబ్బంది పడకూడదని అధికారులకు సూచించారు. ప్రజలు ఇబ్బంది పడినట్లు అయితే అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట ఎంపీ ఓ సందీప్ కుమార్ ఏ ఈ మహేష్ పంచాయతీ కార్యదర్శి శ్రావణి పంచాయతీ సిబ్బంది యాగానందం లింగయ్య తదితరులు ఉన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నల్లగొండ, సూర్యాపేట
యాదాద్రిభువనగిరి
శనివారం | మార్చి 23. 2024 | www.navatelangana.com

స్నేహితుని కుటుంబానికి ఆపన్న హస్తం



నవతెలంగాణ-చిట్యాలటౌన్

పట్టణ కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో 2004-05 బ్యాచ్ పదవ తరగతి చదివిన వనిపాకల గ్రామానికి చెందిన జోగు ఎల్లేష్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయనతోపాటు కలిసి చదువుకున్న తోటి స్నేహితులు కుటుంబానికి అండగా నిలవాలనే ఉద్దేశంతో రూ.57 వేలు శుక్రవారం అతని భార్యకు అందజేశారు. భవిష్యత్తులో కూడా అన్ని విధాలుగా సహకరిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు. సాగర్ల మహేష్ ,జిట్ట నరేష్, టీంపాక గిరిబాబు,గడ్డం గోవర్ధన్,కడారి వెంకన్న, వై కిషన్, ఎస్ విజయ్ కుమార్, కె శ్రీశైలం, మేడి అర్జున్ బాలరాజు, వి శేఖర్,బి శ్రీశైలం, ఊషిరం,జి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రం లో పోషణ్ పక్వాడ

నవతెలంగాణ-పెద్దవూర

అనుముల ఐసీడీఎస్ పరిధిలోని పెద్దవూర మండలం చల్లకుర్తి సెక్టారు పరిధిలోని నీమా నాయక్ తండా, ఊరాబావి తండా,మల్లవాణి కుంట తండా, బెట్టేలా తండా, పుల్యా తండా అంగన్వాడీ కేంద్రాలలో శుక్రవారం పోషణ పక్వాడ కార్యక్రమం సూపర్ వైజర్ గౌసియా బేగం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. చిరుధాన్యాల గురించి వాటినుండి అందే పోషణ గురించి గర్భిణీ మహిళలకు, యుక్త వయస్సు మహిళలకు బాలికలకు, అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్ వైజర్ మాట్లాడుతూ ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు అంగన్వాడి పరిధిలో గల మహిళలకు చిరుధాన్యాల వల్ల అందే పోషక విలువలను తెలియజేయడం జరిగిందని అన్నారు. ప్రతి ఒక్క మహిళలు రాగులు, సజ్జలు, కొర్రలు, మొదలగు త్రుణ ధాన్యాలలో ఐరన్ పిండిపదార్థాలు అధికంగా లభిస్తాయని తెలిపారు. చిరుధాన్యాలను తప్పనిసరిగా మహిళలందరూ స్వీకరించి ఆరోగ్యంగా ఉండాలని కోరారు.ఈ కార్యక్రమంలోఅంగన్వాడి టీచర్లు రమావత్ వాణి, సరోజ, పార్వతి, లక్ష్మి, అనసూర్య, బాలింతలు,గర్భిణీలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పాటరాయాలంటే ...
కత్తుల వంతెన దాటాలి-కన్నీటి సంద్రం ఈదాలి

- పల్లెల్లో పనిచేసేవారు పాడుకున్న పాటలే నా రచనలకు పునాది
- జాతీయ ఉత్తమ గేయరచయిత అవార్డు గ్రహీత సుద్దాల అశోక్ తేజ



నవతెలంగాణ-సూర్యాపేట

పాటరాయాలంటేకత్తుల వంతెన దాటాలని, కన్నీటి సంద్రం ఈదాలని, పాటల రచన పూలపాన్పుకాదని, అయినా నిరాశ అవసరం లేదని జాతీయ ఉత్తమ గేయ రచయిత అవార్డు గ్రహీత సుద్దాల అశోక్ తేజ అన్నారు. ప్రపంచ కవిత్వదినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం రాత్రి మనమ్ వికాస వేదిక అధ్యక్షుడు పెద్దిరెడ్డి గణేష్ ఆధ్వర్యంలో ప్రముఖ పారిశ్రామికవేత్త, సుధాకర్ పివిసి ఎండి మీలా మహాదేవ్ అధ్యక్షతన నిర్వహించిన 'అశోక్ తేజతో ఓ సాయంత్రం' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.పల్లెల్లో పనిచేసే ఆడవారు, కూలీలు పాడుకునే జానపదులు,చిందుయక్షగానాలునా రచనలకు పునాదులని పేర్కొన్నారు. ప్రజా వాగ్గేయకారుడు,పోరాట యోధుడు తన తండ్రి సుద్దాల హనుమంతులోని డిఎన్ఏ, తల్లి జానకమ్మలోని జన్యువు తన పాటలకు ఆధారమని, నాలోని ప్రతిభ తన అమ్మనాన్నలకు చెందుతుందని తెలిపారు. కొమరంబీముడో అంటూ... ఇంతి ఏ ఇంతిజానవే... అన్న ఓసే రాములమ్మ తదితర పాటలను ఈ సందర్భంగా ఆయన ఆలపించి ఆకట్టుకున్నారు. ప్రముఖకవి, జర్నలిస్ట్ ప్రసేన్ ప్రధానవక్తగా సుద్దాల అశోక్ తేజ పాటలను సమీక్షించారు. మరో ఘంటసాలగా పేరుందిన బుర్రి వెంకటేశ్వర్లు బృందం ఆలపించిన పాటలు ఆకట్టుకున్నాయి. గుండా రమేష్ వ్యాఖ్యాతగా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్‌చైర్మెన్ పెద్దిరెడ్డి రాజా, ప్రముఖ రైస్ మిల్లర్ కక్కిరేణి చంద్రశేఖర్, క్లాత్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు గండూరి శంకర్, ప్రముఖ రియల్టర్ బొలిశెట్టి మధు, గెల్లి అంజన ప్రసాద్, శేఖర్, చిట్టి పాక వీరయ్య, వీరారెడ్డి, హెూప్ స్వచ్ఛంద సేవా సమితి అధ్యక్షుడు దైద వెంకన్న, యమా ప్రభాకర్, బోనగిరి భాస్కర్, శీల అవిలేను కవులు, కళాకారులు, సాహితీ ప్రియులు పాల్గొన్నారు.

కేజ్రీవాల్ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నాం



నవతెలంగాణ-తిరుమలగిరి

2021-22 వ సంవత్సరం ఢిల్లీ ప్రభుత్వం ఎక్సైజ్ పాలసీని రూపొందించడంలో ,అమలు చేయడంలో అవినీతి ,మనీలాండరింగ్ ఆరోపణలపై ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) అరెస్టు చేయడాన్ని ఆమ్ అద్మి పార్టీ జిల్లా అధికార ప్రతినిధి దుంపల మురళీదర్ రెడ్డి ఖండించారు.శుక్రవారం మున్సిపల్ కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలోనే ఒక ముఖ్యమంత్రిని కోర్టులో చార్జిషీటు కూడా సమర్పించకుండా అరెస్టు చేయడం ఇదే తొలిసారన్నారు. బీజేపీ వ్యతిరేక ధోరణి బలపడుతుండగా, విపక్షాల కూటమి తమ విభేదాలను పక్కన పెడుతున్నందువలన ఎన్నికల ఫలితాల పట్ల బీజేపీ నాయకులు భయపడుతున్నారన్నారు. బీజేపీ పాలనలో పెద్ద ఎత్తున పెరుగుతున్న అవినీతితో కూడుకున్న అనేక ప్రధాన సమస్యల నుండి ప్రజల దృష్టిని మరల్చడమే లక్ష్యం అన్నారు.ఈ సందర్భంలో, కేజ్రీవాల్ అరెస్టు మరియు ఇతర ప్రతిపక్ష నాయకులైనబి ఆర్ ఎస్ పార్టీ నాయకురాలు కవిత ను అరెస్ట్ చేసి ఆకస్మిక దాడులు అక్రమ నిర్బంధాలన్నిటినీ ప్రజాస్వామిక శక్తులు గట్టిగా ఖండించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఈ సమావేశంలో అమ్ ఆద్మీ పార్టీ నాయకులు దుంపల పారిజాత, చల్లా సాలయ్య, వై సోమలక్ష్మి వై యాకూబ్ రెడ్డి, బెజ్జంకి నరసింహ చారి, సావిత్రమ్మ గంటా సందీప్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ ఏకశిల చలిదొన లక్ష్మీ నరసింహస్వామి రథోత్సవం

- ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి



నవతెలంగాణ-నాంపల్లి

మండలంలోని తుంగపాటి గౌరారం గ్రామ పరిధిలో సువిశాలమైన పర్వతశ్రేణుల్లో సహజ సిద్ధంగా వెలసిన శ్రీ ఏకశిలా చలిదొన లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా శుక్రవారం రథోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఉత్సవ కమిటీ చైర్మెన్ పులకరం వెంకటయ్య ముదిరాజ్ ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ కార్యనిర్వాహణాధికారి జయరామయ్య మార్గదర్శకత్వంలో కార్యక్రమాలు నిర్వహించారు. మర్రిగూడెం మండల కేంద్రానికి చెందిన పట్టణ గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ మాస నీలిమ చంద్రశేఖర్ దంపతులు సుమారు 3000 మంది భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎలుగోటి వెంకటేశ్వర రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు కత్తి రవీందర్ రెడ్డి, జిల్లా నాయకులు ఏరెడ్ల రఘుపతి రెడ్డి, మాజీ ఎంపీపీ పూల వెంకటయ్య, గజ్జల శివారెడ్డి, గట్ల రాజశేఖర్ రెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులు కొసిరెడ్డి నరేష్, పోచం రెడ్డి శ్రీధర్ రెడ్డి, బేకరీ రవి, తెలుచూరి మైవమ్మ కార్యక్రమం నిర్వహణలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి



నవతెలంగాణ-చిట్యాలటౌన్

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామని సైమేడ్ ల్యాబ్ ఫార్మా పరిశ్రమ ఆపరేషన్ హెడ్ వాసిరెడ్డి శ్రీనివాస్, హెచ్ ఆర్ మోహన్ ,జనరల్ మేనేజర్ రాజేంద్రకుమార్ అన్నారు. మండలంలోని ఏపూర్, పిట్టంపల్లి, బొంగోనిచెర్వు,పేరేపల్లి గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో సైమేడ్ వియాష్ గ్రూప్ ఆధ్వర్యంలో సుమారు 10 లక్షల విలువైన ఫర్నిచర్, క్రీడా సామగ్రి, కంప్యూటర్లు, ప్రింటర్లు శుక్రవారం అందజేశారు. ప్రభుత్వ పాఠశాలలతో పాటుగా గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమ ప్రతినిధులు రామారావు, అచ్యుత్, వెంకటేష్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శాలివాహన చక్రవర్తి జయంతి వేడుకలు

నవతెలంగాణ-చిట్యాలటౌన్



పట్టణ కేంద్రంలో శుక్రవారం శ్రీ భవాని కుమ్మర సంఘం ఆధ్వర్యంలో చరిత్రగాంచిన తొలితెలుగు చక్రవర్తి శాలివాహన చక్రవర్తి జయంతిని ఘనంగా నిర్వహించారు. భవాని కుమ్మరి సంఘం అధ్యక్షులు కంభంపాటి నరసింహ ఆధ్వర్యంలో శాలివాహన చక్రవర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో భవాని కుమ్మరి సంఘం నాయకులు ఆరూరి సత్తయ్య, బొడ్డుపల్లి చంద్రశేఖర్, మిడిదొడ్డి శ్రీరాములు, ఉట్కూరి బాలకృష్ణ, బొడ్డుపల్లి లింగయ్య, సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పరీక్షా ప్యాడ్లు అందజేత

నవతెలంగాణ-చిట్యాలటౌన్

పట్టణంలోని జెడ్పీహెచ్ఎస్ హైస్కూల్లో పదవ తరగతి పరీక్ష రాసే పిల్లలకు శుక్రవారం వై ఆర్ పీ ఫౌండేషన్ తరపున పరీక్షా ప్యాడ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు బెల్లి సత్తయ్య, రేముడాల లింగస్వామి పాఠశాల ప్రధానోపాధ్యాయులు కరుణాకర్ రెడ్డి, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు విడుదల

నవతెలంగాణ-చిట్యాలటౌన్

పట్టణంలోని శ్రీ కనకదుర్గ అమ్మవారి దేవస్థానం ఈనెల 26వ తేదీ మంగళవారం జరిగే వార్షిక బ్రహ్మోత్సవాల కరపత్రాన్ని శుక్రవారం ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మెన్ మారగోని ఆంజనేయులు గౌడ్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు వినయ్ మోహన్ శర్మ గోవిందు మిశ్రా, ఆలయ అధికారి అంబటి నాగిరెడ్డి తో పాటు డైరెక్టర్లు బుద్ధ విమల కృష్ణమూర్తి, గంజి వెంకటేశం, వరకాంతం నరసింహారెడ్డి, రుద్రారపు లింగయ్య, జిట్ట సాయిలు, వనమా నిఖిల్ కుమార్ పాల్గొన్నారు.

అంగన్వాడి కేంద్రంలో పోషణ పక్షం కార్యక్రమం నిర్వహణ

నవతెలంగాణ-నాంపల్లి

మండలంలోని తుమ్మలపల్లి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం సూపర్ వైజర్ శశికళ అదర్వములో పోషణ పక్షం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలింతలకు చిరుధాన్యాల పై అవగావన కల్పిస్తు బాలింతలు సమతుల్య మైన పోషకాహారము తీసుకొని రక్తహీనత తగ్గించుకోవాలని బలమైన పోషకాహారం గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం లో అంగన్ వాడి టీచర్ అకునురి నాగలక్ష్మి, హెడ్మాస్టర్ అనుదీప్, పంచాయతీ కార్యదర్శి ప్రసన్నబాబు, ఆశా కార్యకర్త అనిత, పిల్లల, తల్లులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ పోషకాహారం తీసుకోవాలి

నవతెలంగాణ-మిర్యాలగూడ

ప్రతి ఒక్కరూ పోషకాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లీలాకుమారి కోరారు పోషణ పక్షం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఎన్ఎస్పీ క్యాంప్ సెక్టార్ పదవిలోని అంగన్వాడి కేంద్రంలో పోషణ పక్షం కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా పోషక విలువలు కూడిన పదార్థాలు ఆకుకూరలు పిండి పదార్థాలు ప్రదర్శనలో ఉంచి గర్భిణీలు బాలింతలకు అవగాహన కల్పించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉండవచ్చు అన్నారు ఆరు నెలల తీసుకోవాల్సిన ఆహారంపై అవగాహన కల్పించి తల్లిపాలు ఇవ్వడంపై పిల్లల ఆరోగ్యాన్నీ వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు రజిని, నాగలక్ష్మి, విజయ, భారతి, స్వరూప, సంఘ బంధం లీడర్ నాగమణి తదితరులు పాల్గొన్నారు.

పేదింటి ఆడపిల్ల పెండ్లికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-శాలిగౌరారం

మండలంలోని బాలిశెట్టి గూడెంలోని నిరుపేద కుటుంబమైన చిల్లంశెట్టి శోభ బిశంకరయ్య కుమార్తె మహేశ్వరి వివాహానికి చైత్ర ఫౌండేషన్‌చైర్మెన్ యంగలి రామకృష్ణ గౌడ్ రూ.20,116 ఆర్థిక సాయం శుక్రవారం కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు సమరం రెడ్డి,మాజీ అధ్యక్షులు బండపెల్లి కొమురయ్య, లయన్స్ క్లబ్ చార్టర్ ప్రెసిడెంట్ బుడిగె శ్రీనివాస్, నాయకులు చింత ధనంజయ్,తోట్ల పుల్లయ్య, బొల్లికొండ గణేష్ బట్ట శ్రీనివాస్,చిల్లంశెట్టి యుగంధర్, సాయి గణేష్,గండమల్ల నగేష్ చిల్లంశెట్టి నాగార్జున,గుదే సతీష్,కడారి మహేష్,పట్టేటి కృష్ణంరాజు,గుండ్లపల్లి ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

దండు మైసమ్మ ఆలయ హుండీ లెక్కింపు

నవతెలంగాణ-ఆత్మకూర్ ఎస్

మండలంలోని నిమ్మికల్ గ్రామంలో ఉన్న దండుమైసమ్మ ఆలయంలోని శుక్రవారం అధికారుల పర్యవేక్షణలో ఉందిని లెక్కించారు 84 రోజులకు 4, 54 594 రూపాయలు వచ్చినవి. ఈ లెక్కింపు పర్యవేక్షణ అధికారి ఎం వెంకటలక్ష్మి నల్గొండ డివిజన్ ఇన్స్పెక్టర్ వెంకటలక్ష్మి, సీనియర్ అసిస్టెంట్, నాగేశ్వరరావు, జూనియర్ అసిస్టెంట్ బి . సైదులు ,శ్రీనివాస్, అర్చకులు కిరణ్ కుమార్ శర్మ ముఖ్య అర్చకులు సతీష్ కుమార్ చారి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైతుకు ఆర్థిక సహాయం



నవతెలంగాణ-నల్గొండటౌన్

సూర్యాపేట జిల్లా యర్కారం గ్రామం దుబ్బ తండలో 5 ఎకరాల సాగు చేసిన వరి పంట నీరు లేక ఎండిపోవడంతో తెచ్చిన పెట్టుబడి రాకపోవడంతో ఆ పంట పొలంలో రైతు కన్నీటి వేదన సోషల్ మీడియాలో రావడంతో రాయల్ ఇవి కంపెనీ ప్రారంభం సందర్భంగా శుక్రవారం జిల్లా కేంద్రంలో తన బ్రాంచ్ ప్రతినిధులతో ఆ రైతుకు 30 వేల చెక్కును రైతు ధరావత్ నరసింహకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నల్గొండ మున్సిపాలిటీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, గుమ్మలమోహన్ రెడ్డి, జడ్పిటిసి వంగూరి లక్ష్మయ్య, ప్రొఫైటర్ జయ కృష్ణ, చనగోని నగేష్ గౌడ్, అయిత గోని రమేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షునిగా ఆంజనేయులు

నవతెలంగాణ-చండూరు

బీజేపీ మండల అధ్యక్షునిగా చామలపల్లి గ్రామానికి చెందిన ముదిగొండ ఆంజనేయులు నియమితులయ్యారు. నల్లగొండలో బీజేపీ జిల్లా అధ్యక్షులు డా.నాగం వర్షిత్ రెడ్డి చేతులమీదుగా నియామక పత్రంను అందుకున్నారు..ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ పార్టీ అభివృద్ధి కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర ఉపాధ్యక్షులు గంగిడి మనోహర్ రెడ్డికి, ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యకి, జిల్లా అధ్యక్షులు నాగం వర్షిత్ రెడ్డికి, అసెంబ్లీ కన్వీనర్ దూడల బిక్షంకి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏరెడ్ల శ్రీనివాస్ రెడ్డికి, జిల్లా ఉపాధ్యక్షులు కోమటి వీరేశంకి, మాజీ మండల అధ్యక్షులు కాసాల జనార్దన్ రెడ్డికి పార్టీ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు గోలి మధు సూదన్ రెడ్డి, యాస అమరేందర్ రెడ్డి, జిల్లా ఉపా ధ్యక్షులు సోమ నరసింహ, జిల్లా కార్య దర్శి దర్శనం వేణు, నాయ కులు బోడ ఆంజనేయులు, తడకమల్ల శ్రీధర్, నరాల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

